Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి : 4
సంచిక : 57

ఆదివారం
ఆగస్టు,6,2023

పేజీలు - 8 వెల - రూ 5 : 00

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఐదో దశ దాటేసిన చంద్రయాన్....

బెంగళూరు, చంద్రయాన్-3 ఇప్పుడు ఎక్కడుంది అన్న విషయంపై ఇస్రో తాజాగా ఓ కీలక అప్డేట్ ఇచ్చింది. భూమి కక్ష్యను వీడి, చంద్రుడివైపు ప్ర యాణాన్ని మొదలుపెట్టిందని స్పష్టం చేసింది. చంద్రయాన్-3పై మరో కీలక అప్డేట్ ఇచ్చింది ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్). ప్రస్తుతం ఈ స్పేస్‌క్రాఫ్ట్.. భూమి కక్ష్యను వీడి, చంద్రుడివైపు ప్రయాణిస్తోందని స్పష్టం చేసింది. ట్రాన్స్‌లూనార్ ఆర్బిట్‌లోకి చంద్రయాన్-3ని పంపించే ప్రక్రియను పూర్తి చేశాము. ఈ ప్రక్రియను పెరేగీ-ఫైరింగ్ అని అంటారు. ఇస్రో టె లిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్‌లో దీనిని పూర్తి చేశాము. ఫ లితంగా ఈ స్పేస్‌క్రాఫ్ట్ భూమి చుట్టూ తిరగడం ఆపేసి, చం ద్రుడివైపు ప్ర యాణాన్ని మొదలుపెట్టింది," అని వెల్లడించింది ఇస్రో. అంటే.. టీఎల్ఐ మేన్యువర్‌తో.. స్పేస్‌క్రాఫ్ట్‌ను లూనార్‌ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీలో పెట్టింది ఇస్రో. దీనితో చంద్రుడివైపు యాత్రను మొదలుపెట్టింది చంద్రయాన్-3.



## ఎన్నికల వాతావరణలో కార్యక్రమాలు

### హ్యాట్రిక్ సాధిస్తామన్న ధీమాలో అధికార పార్టీ
### తాయిలాలు ప్రకటిస్తూ ముందుకు పోతున్న బిఆర్ఎస్

హైదరాబాద్, ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తెలంగాణలో నెలకొన్న ఎన్నికల వాతా వరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన ఎన్నికలో గెలుపు పై అప్పుడే అంచనాలు వేస్తున్నారు. అధికార బిఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని హ్యాట్రిక్ సాధిస్తామని ప్రకటించింది. పనిచేసేవారిని ప్రజలు వదులుకోరిన మంతరి కెటిఆర్ ప్రకటించారు. ఇదే క్రమంలో తాయిలాలతో బిఆర్ఎస్ దూకుడు ప్రదర్శిస్తోంది. ఆర్టీసీ విలీనం, రైతురుణమాఫీ తదితర పథకాలు ఇందులో భాగమే.



## గిరిజనులపట్ల కేంద్రం దారుణం

### మండలిలో స్వల్పకాలిక చర్చలో కవిత

**హైదరాబాద్,** గిరిజనుల పట్ల కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మణిపూర్‌లో ప్రభుత్వ ప్రోత్సాహంతోనే దారుణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజనుల హక్కులను కాలరాసేలా కేంద్ర అటవీ చట్టం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమం, పోడు భూముల పట్టాల పంపిణీపై శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లు ఆరు నుంచి 9 శాతానికి పెంచుకున్నా మన్నారు. గిరిజనులకు 4 లక్షల 5 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చామని వెల్లడించారు. దీనిద్వారా 1 లక్షా 57 మంది గిరిజన కుటుంబాలకు పోడు భూములపై హక్కులు లభించాయని చెప్పారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి పథకాలతో గిరిజన ఆడబిడ్డలకు ప్రయోజనం కలుగుతున్నదని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు వేలకుపైగా ఎస్టీ విద్యార్థులకు జాతీయ స్థాయి అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు వచ్చాయని చెప్పారు. ఆసియా లోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం అని, జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.340 కోట్లు ఖర్చుచేసి ఒదన్నారు. గోండు, బంజారా లాంటి గిరిజనుల కళలను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు.



## మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

### కాల్పుల్లో ముగ్గురు వ్యక్తుల దుర్మరణం
### ఉగ్రవాదుల పనిగా అనుమానం

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. బిష్ణుపూర్ జిల్లా, క్వాక్టా పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు తండ్రీకొడుకులు ఉన్నారు. ఈ తండ్రీకొడుకులిద్దరినీ ఉగ్రవాదులు కాల్చి చంపేసి, ఆ తర్వాత వారి మృతదేహాలను కత్తులతో ముక్కలు చేశారు. దీంతో మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా హింస కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం ఉ దయం బిష్ణుపూర్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ముగ్గురు మృతి చెందారని పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



## చలో రాజ్‌భవన్ పిలుపుతో.. ఉద్రిక్తత

హైదరాబాద్,
ఆర్టీసీ విలీనం బిల్లును గవర్నర్ తమిళసై తొక్కిపెట్టడం సంస్థ కార్మికులు, ఉద్యోగులు భగ్గుమన్నారు. శనివారం ఉదయం 2 గంటలపాటు రాష్ట్ర వ్యాప్తంగా డిపోల ముందు ధర్నాలు చేసిన కార్మికులు.. రాజ్‌భవన్ను ముట్టడించారు. దీంతో రాజ్‌భవన్ ముందు ఉద్రిక్తత నెలకొంది. అయితే పాండిచ్చేరిలో ఉన్న గవర్నర్ తమిళసై కార్మిక నేతలను యర్చకు ఆహ్వానించారు. బిల్లు వల్ల కార్మికులకు లాభం చేకూరాలన్ ఆకాంక్షను వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్మిక నేతలతో మాట్లాడారు. బిల్లుపై కొన్ని అభ్యంతరాలను ప్రభుత్వం నుంచి వివరన కోరారని, అవి రాగానే వెంటనే పంపుతానని వారికి హామీ ఇచ్చారు. కార్మికుల పక్షాన ఎప్పుడూ ఉంటానని అన్నారు. అయితే గవర్నర్ సందేహాలను ప్రభుత్వం తీర్చిందని అంటున్నారు. మొఒత్తంగా రాజ్‌భవ్ వద్ద ఉ దయం నుంచి హైడ్రామా నెలకొంది. చలో రాజ్‌భవన్ పిలుపుతో భారీగా పోలీసులు మొహరించారు. గవర్నర్ సమాధానం తో కార్మిక సంగాల నేతలు సృంతప్తి చెందారు. త్వరా బిల్లు చేరేలా చూడాలన్నారు.




గవర్నర్ తీరుకు నిరసనగా కదం తొక్కిన కార్మికులు
వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గవర్నర్ చర్చలు
బిల్లు ఆమోదించేదుకు
పలు అభ్యంతరాలు
వివరాలు అందచేసిన తెలంగాణ ప్రభుత్వం
గవర్నర్ హామీతో వెనుదిరిగిన
కార్మిక సంఘాల నేతలు

## గవర్నర్ లేని సమయంలో రాజకీయమా

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఈటెల

హైదరాబాద్,
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బీజేపీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. ప్రభుత్వ ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ విలీనం బి ల్లుపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పందించారు. శని వారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... గవర్నర్ లేని సమయం లో బిల్లు పంపి ఆమోదించడం లే దని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. బట్ట కాల్చి మీద వేస్తు న్నారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు ఇవ్వలేదని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు గుండెల్లో బాధను మర్చిపోలేద న్నారు. మహిళా కండక్టర్లను ఇష్టం లేకపోయినా రాజ్‌భవన్ వద్ద ధర్నాకు పంపుతున్నారని విమర్శించారు.

## ప్రజానాడి






## జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం..

- రూ. 1200 కోట్ల చొప్పున ప్రత్యేక బడ్జెట్..
- మగ్గాలకు జియో ట్యాగింగ్..
- 40 వేల నేతన్నలకు బీమా కవరేజ్..
- అంతరించిపోయిన చేనేత కళాకృతులను వెలికితీస్తున్నాం..
- నేతన్నలను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు..
- చేనేత పథకాల పట్ల పలు రాష్ట్రాలు ఆసక్తి..
- నేతన్నలకు సమగ్ర ఆరోగ్య బీమా: మంత్రి కేటీఆర్ పిలుపు

హైదరాబాద్,
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన కార్యక్రమాలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి కోసం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించుకున్నాం. ఇదే స్ఫూర్తి తో రాష్ట్రంలోని నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందని కేటీఆర్ పేర్కొన్నారు. చేనేత, జౌళి రంగానికి చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా ఏ ప్రభుత్వము కేటాయించని విధంగా 2016-2017 నుండి ప్రతి సంవత్సరం ప్రత్యేక బడ్జెట్ రూ.1200 కోట్ల చొప్పున కేటాయిస్తువస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశనంలో చేనేత కార్మికుల సంక్షేమం , ఉపాధి కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యల పాలవుతున్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారికి రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. 2010 నుంచి ఉన్న లక్ష రూపాయల రుణాలను మాఫీ చేయడంతో 10,148 చేనేత కార్మికులు రూ.28.97 కోట్ల రుణాల నుండి విముక్తి అయ్యారని కేటీఆర్ వివరించారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేనేత వృత్తిపై ఆధారపడిన నేతన్నలను గుర్తిస్తూ, వారి మగ్గాలను జియో ట్యాగ్ చేయడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితులపైన పూర్తి అవగాహనతో అనేక కార్యక్రమాలను ప్రారంభించుకున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత మిత్ర పథకం ద్వారా దాదాపు 50 శాతం రాయితీని వస్త్రాలు, రసాయనాల కొనుగోలు పైన అందిస్తున్నాం. చేనేత మిత్ర పథకం ద్వారా ఇప్పటివరకు 22 వేల మంది నేతన్నలకు సూమరు 90 కోట్ల సబ్సిడీని నేరుగా వారి ఖాతాలలోనే అందుకున్నారని తెలి పారు. నేతన్నలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న నేతన్నకు చేయూత కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికుడు పొదుపు చేసే 8 శాతానికి రెట్టింపుగా 16 శాతం, పవర్ లూమ్ కార్మికులు పొదుపు చేసుకునే 8 శాతానికి అదనంగా మరో 8 శాతం మెత్తాన్ని ప్రభుత్వం తన వాటాగా వారి ఖాతాల్లో జమ చేస్తుందని కేటీఆర్ వివరించారు. 2017లో ప్రారంభమైన ఈ పథకాన్ని కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో లాకింగ్ పీరియడ్‌ను సవరించి మరీ ముందస్తు వెసులుబాటు ఇవ్వడం వలన దాదాపు రూ. 100 కోట్ల ప్రయోజనాన్ని రాష్ట్రంలోని 21 వేల నేతన్నలు అందుకున్నారు. నేత కార్మికుల కోరిక మేరకు ఈ పథకమును రూ.90.00 కోట్ల బడ్జెట్ ప్లాన్‌తో తిరిగి ప్రారంభించాము. ఇప్పటివరకు ఈ పథకంలో 32,328 మంది చేనేత కార్మికులు చేరారు. రాష్ట్రంలోని రైతన్నలకు అందుతున్న రైతు బీమా మాదిరే నేతన్నకు ప్రత్యేకంగా రూ. 5లక్షల నేతన్నకు భీమా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా 59 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు ఉన్న 40,000 మంది నేతన్నలకు బీమా కవరేజ్ ను అం దిస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. చేనేత కళ అంతరించి పోకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్న ఉదాత్తమైన లక్ష్యంతో టీఎస్‌సీవో ద్వారా ప్రత్యేక ఆర్ అండ్ డీ విభాగము ఏర్పాటు చేసి, చేనేత రంగములో డిజైన్లు, వస్త్రోత్పత్తి పరిశోధనలో భాగంగా? తెలంగాణలో ఒకప్పుడు ప్రాచుర్యము పొంది కాలక్రమేణా అంతరించిపోయిన చేనేత కళాకృతులను వెలికితీసి, వాటికి నవీనరీతులను జోడించడం జరిగింది. తద్వారా టీఎస్‌సీవో "పీతాంబరి పట్టు చీరలు",



## స్వయం పాలనతోనే శాసించుకోగలం

### నిరంతరం తెలంగాణ కోసం ఉద్యమించిన దీప్తి
### ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నేడు

వరంగల్, భవిష్యత్తు తెలంగాణలో అభివృద్ధి చాలా శీఘ్రంగా జరుగుతుంది. నీళ్లలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విష యంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయంపాలనలో శాసిస్తాం. ఇతరుల పాలనలో యాచిస్తున్నాం.పెద్ద ప్రాజెక్టుల సంగతి కాసేపు పక్కన పెడితే.. నిజాం కాలంనాటికే తెలంగాణ ప్రాంతంలో గొలుసు చెరువులు చాలా ఉండేవి. ఉద్దేశ పూర్వకంగానే వాటిని నాశనం చేశారు.
తెలంగాణ వస్తే మొదటగా ఈ చెరువులను పునరుద్ధరిం చాలి. అన్నీ సాధ్యం కాకపోవచ్చు.. అయినా వీటిని బాగుచేస్తే.. గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్ కన్న కలలు ఇవి. తెలంగాణ ఏర్పాటు వల్ల స్వయం సమృద్ధి సాధిస్తామని బలంగా నమ్మి, జీవితాంతం తెలంగాన ఏర్పాటు కోసం అహరహరం శ్రమించారు. ఇప్పడు జలవనరుల విషయంలో తెలంగాణలోని కెసిఆర్ ప్రభుత్వం అదే చేస్తోంది. ఇక నిజాం కాలంలో విద్య, వైద్యం రెండూ ఉచితమే.. అయితే వీటన్నింటిని వారు నాశనం చేశారు. అభివృద్ధి అంటారు కానీ వాళ్లు ఇక్కడ ఒక్క ఆసుపత్రినిగానీ, కాలేజీనిగానీ కట్టారా అని జయశంకర్ సార్ తరచూ ప్రశ్నించేవారు. తెలంగాణ వస్తే ముఖ్యంగా వనరుల కొరత ఉండదు. ఇప్పడు వాటిని ఇష్టానుసారంగా, అక్రమంగా తరలించుకుపోతున్నారు.

# సంగెం దేవాలయంలో దొంగల చేతివాటం



**కోరుట్ల రూరల్ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

కోరుట్ల మండలం సంగెం గ్రామంలోని సంగమేశ్వర, ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు చేతి వాటాన్ని చూపారు. వివరాల్లోకి వెళితే కోరుట్ల పట్టణంలోని రామాలయం, భీముని దుబ్బ ప్రాంతంలోని దేవాలయాల్లో జరిగిన దొంగతనాలు మరువక ముందే తాజాగా సంగెం సంగమేశ్వర మరియు ఎల్లమ్మ ఆలయాల్లో హుండీ ని ధ్వంసం చేసి సుమారు ముప్పై నుండి నలభై వేల వరకు నగదు దోచుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. దేవాలయాల భద్రతకు ముప్పు ఏర్పడుతున్నదని దేవునికే భద్రత లేనప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



**కోరుట్ల టౌన్ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

బిడ్డకు తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యమని అంగన్ వాడి సూపర్ వైజర్ ప్రేమలత అన్నారు. శనివారం పట్టణంలోని బోయవాడ కాలనీలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... తల్లిపాల వల్ల శిశువుకు సరైన పోషకాహారం అందుతుందని, రోగనిరోధక వ్యవస్థ మెరుగవుతుందని తద్వారా బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని తెలిపారు. గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం శ్రీమంతాలు, అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి. రజిత, ఆర్ పి శ్రీదేవి, ఆశావర్కర్ భాగ్యలక్ష్మి, తల్లులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలు




**కోరుట్ల టౌన్ ఆగస్ట్ 04 (ప్రజామంటలు)**

స్థానిక కటుకం సంగయ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన స్వాగతోత్సవ వేడుకలలో విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల శ్వేత మాట్లాడుతూ.... విద్యార్తులు శ్రద్ధతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమము లో కళాశాల కరస్పాండెంట్ నలువాల శేఖర్ రెడ్డి, మసిపట్ల రాజేందర్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత - యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో హరితహారం



**జగిత్యాల ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని 15 వార్డులో గల ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ మొక్కలు నాటడం పట్ల యూనియన్ బ్యాంక్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ హైదరాబాద్ డిప్యూటీ జోనల్ అధికారి అరవింద్ కుమార్, నిజామాబాద్ రీజినల్ హెర్మాన్ శంకర్, నిజాంబాద్ డిప్యూటీ రీజినల్ హెడ్ శివకోటయ్య, జగిత్యాల లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ రెడ్డి, మేనేజర్ చాణక్య, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, ఎస్కే ఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, స్థానిక వార్డు కౌన్సిలర్ తోట మల్లికార్జున్, కళాశాల లెక్చరర్లు, ఇతర బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సాధనకై కలెక్టరేట్ ముందు ఏఎన్ఎంల ధర్నా వ్రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్ చేయాలి



**జగిత్యాల ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి 9 ఏళ్ళు దాటినా ఈవిషయాన్ని పట్టించుకోవడం లేదని తెలంగాణ ఉమేన్ ఏఎన్ఎం అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాండ్ల మధురిమ, పడాల మమతలు మండిపడ్డారు. రెండవ ఏఎన్ఎం ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో 3 వేల మందిని అరెస్ట్ చేసినందుకు నిరసనగా జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ముందు మధురిమ, మమత ల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మధురిమ, మమతలు మాట్లాడుతూ.... గత 16 ఏళ్లుగా ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఒకటవ ఏఎన్ఎం లకు సమానంగా విధులు నిర్వహిస్తున్న, ఉద్యోగ భద్రత లేదని,మమ్మల్ని ఎన్హెచ్ఎం, కాంట్రాక్ట్ ఉద్యోగులని చిన్న చూపు చూస్తున్నారని వాపోయారు. కోవిడ్ సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి సేవాలాందించామని, వివిధ రకాల వైద్య సేవలు అందిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మా జీతాలను ఇప్పుడున్న కనీస జీవన వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ఎంపిహెచ్డబ్ల్యూ (మెల్) లతో సమానంగా వేతనాలు చెల్లించాలని మధురిమ, మమతలు కోరారు. ఏలాంటి వ్రాత పరీక్ష లేకుండా మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పద్ధతినా పనిచేసిన జూనియర్ లెక్చరర్లను, విఆర్ఏ లు, ఆర్టీసీ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన మాదిరిగా మమ్మల్ని పర్మినెంట్ చేసి మా కుటుంబాలను ఆదుకోవాలని మధురిమ, మమతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కొత్తగా ఏఎన్ఎం ల నియామకం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి మా సర్వీస్ క్రమబద్ధీకరించాలన్నారు. అలాగే యూరోబిన్ కమిషన్ పేరుతో నియామకమైన ఏఎన్ఎం లకు 5 నెలలుగా వేతనాలు లేకజగిత్యాల జిల్లాలో 19 మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే జీతాలు చెల్లించాలని మీడిదొడ్డి కోమల ప్రభుత్వాన్ని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సూచనల మేరకు సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర రాంచంద్రారెడ్డి నిరసనలో పాల్గొని ఏఎన్ఎం లకు సంఘీభావం తెలిపారు. అనంతరం అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. నిరసన కార్యక్రమంలో సాధుల వసంత, వంగల నీరజ, నేరెళ్ల శోభారాణి, విజయ అరుణ కుమారి, మంద స్వరూప, శిరీష, మేరీ,లక్ష్మీ, మీడిదొడ్డి కోమల, లావణ్య, లత, మల్లీశ్వరి, పూల, కళావతి, సునీత, చిలుకమ్మ, నీరజ, వసంత, సుప్రియ,గణిత, రాజ్యలక్ష్మి, శ్రీశైల తదితరులు పాల్గొన్నారు.

# రాహూల్ గాంధీ అనర్హత వేటు విషయంలో స్టే జనగామలో బాణాసంచా పేల్చి కాంగ్రెస్ సంబరాలు

**జనగామ ఆగస్ట్ 05 (ప్రజామంటలు):**

టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు దేశంలో సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు రాహూల్ గాంధీ అనర్హత వేటు విషయంలో స్టే ఇవ్వడంతో జనగామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద బాణాసంచా కాల్చి మిఠాయ్ పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.... సత్యేమే గెలుస్తుంది అనే వాదన , సందేశం నానుడి నిజమవుతోందని భావిస్తున్నని, చెడు కి తాత్కాలికంగా ప్రచారం దొరికిన సత్యమేవ జయతే అని, ప్రజాస్వామ్య దేశంలో దురదృష్టం గుజరాత్ లో ఈ కేసు ఫైల్ అయిందని, జడ్జి ని మార్చిన తరువాత ఆగమేఘాల మీదా తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చిన 24 గంటల లోపే పార్లమెంటరీ వ్యవస్థకి సంబందించిన అధికారులు సమయం ఇవ్వకుండా అనర్హత వేటు వేయడం. ఇది అత్యంత హేయమైన చర్య అని, న్యాయస్థానాలే 30 రోజుల సమయం ఇస్తున్నాయని ఈ కార్యక్రమానికి ఈరోజు ఫుల్ స్టాప్ పడటం సంతోషమని, సోమవారం నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ పాల్గొంటారని భావిస్తున్నామని ఇది దేశానికి ప్రజలకి ఒక శుభ సంకేతమని అన్నారు. దేశంలో జరగుతున్న అప్రజాస్వామికం, రాజ్యాంగ వ్యతిరేక కారణాలతో బ్రష్టు పట్టించే నియంత విదంగా పాలన జరగుతున్న అంశాన్ని గుర్తు చేస్తు...ఇది కొనసాగదు అందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ..ఈదేశం, కాంగ్రెస్ పార్టీ , రాజ్యాంగం



ఇవి విడదీయరాని అనుబంధంగా ఉన్న చారిత్రాత్మక విషయంగా చెప్పుకోవచ్చు. మనమంతా కలసి ఈ పునాదుల మీదా వచ్చాం. ఈ పునాదులు నష్టం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి లింగాజీ, జనగామ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ జనగామ మండలం అధ్యక్షులు కొన్నే మహేందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ చింతకింది మల్లేష్, జనగామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ మాజీద్, మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ జఫర్ షరీఫ్, జనగామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్ట కృష్ణ, రంగు రవి, రఘు ఠాగూర్, పట్టణ ఉపాధ్యక్షులు సుల్తాన్ గోవింద్ రెడ్డి, పండ్ల రాజేష్, జనగామ పట్టణ ప్రధాన కార్యదర్శి నోముల రాజు, మేకల సమ్మయ్య, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సౌద మహేష్, బాల్నే నరేష్, ఎండీ ఫయాజ్, ఎండీ అజామ్, పులిగిల్ల శివ, విజయ్ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి



**జగిత్యాల ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు డిఎస్పి వెంకటస్వామి ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని మోతే గ్రామంలో శనివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ స్థానిక ప్రజలతో మట్లాడుతూ.... ప్రజల రక్షణ గురించి ప్రజల లో భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి మరియు ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, నేర రహిత గ్రామలుగా చేయలనే జిల్లా ఎస్పీ ఉద్దేశ్యం తోనే ఈ యొక్క కార్యక్రమ%శీ% నిర్వహించడం జరుగుతుందని తెలిపినారు. ఈ సందర్భంగా ఎలాంటి పేపర్లు లేని, సరైన నంబర్ ప్లేట్స్ లేని 22 వాహనాలు సీజ్ చేయడం జరిగింది అని మరియు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్ సి, ఇన్సూరెన్స్, మరియు డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు.ఎలాంటి పత్రాలు లేని వాహనాలు నడపవద్దని నడిపేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపినారు. పాత వాహనాలు కొనేటప్పుడు వాటి యొక్క డాక్యుమెంట్స్ చెక్ చేసుకుని కొనాలని డాక్యుమెంట్స్ లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని అన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతూ వుంటే వెంటనే పోలీసుల కు ఫోన్ చేయాలని లేదా డయల్ 100 కాల్ కు ఫోన్ చేసినాచో వెంటనే చర్యలు చేపడతాం అన్నారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుముఖం పట్టడంతో పాటు ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపినారు. ఈ యొక్క కార్యక్రమా%శీ% తరుచుగా నిర్వహిస్తామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు అయినా గంజాయి రవాణా మరియు విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాల సంఖ్య ఎక్కువైందని వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ యొక్క కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సి.ఐ అరిఫ్ అలీ ఖాన్, ఎస్.ఐ లు, ఏఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది, హెూమ్ గార్డ్స్ పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో ఆర్డీవోల నియామకం వద్దు మంత్రి హరీష్ ప్రకటనపై టీజీజీడీఏ నేతల ఆందోళన :డీఎంఈ ఆఫీస్ వద్ద ధర్నా

**సికింద్రాబాద్ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లుగా ఆర్డీవోలను నియమిస్తామని శాసనమండలిలో మంత్రి హరీష్ రావు చేసిన ప్రకటన పట్ల తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ (టీజీజీడీఏ) ప్రతినిధులు మండిపడ్డారు. ఈమేరకు టీజీజీడీఏ ఆధ్వర్యంలో శనివారం కోఠి లోని డీఎంఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.... ప్రభుత్వం వెంటనే ఆసుపత్రుల్లో ఆర్డీవోల నియామక ప్రతిపాదనలను విరమించుకోవాలని టీజీజీడీఏ ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ ప్రవీన్, డాక్టర్ భూపేందర్ రాథోడ్, డా. రంగా, డా. బి. రమేశ్, డా. రవి, డా.వినోద్, డా. లాలూ ప్రసాద్, డా. నరహరి, డా. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# గృహలక్ష్మీ పథకం దరఖాస్తుల స్వీకరణ



**కోరుట్ల టౌన్ ఆగస్ట్ 04 (ప్రజామంటలు)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహ లక్ష్మీ పథకానికి దరఖాస్తులు మండల పరిషత్ మరియు మున్సిపల్ కార్యాలయం లో స్వీకరించడం జరుగుతుంది. కావున లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుచున్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, స్థలం యొక్క పత్రం, ఫోటో కావాలి

# అంగరంగ వైభవంగా రుద్ర సహిత లలిత హావనము, కుంకుమార్చన





**అంబర్ పేట ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాదులోని అంబర్ పేట్ మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో కోటి గాజుల పూజ మహెూత్సవం లో భాగంగా శనివారం ఉదయము గణపతి పూజ, గోపూజ,స్థాపిత దేవత పూజ, మంటపారాధన, రుద్ర సహిత లలిత హవనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం మాతలచే సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ప్రదోష పూజ నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో వేదిక ప్రాంతమంతా మారుమోగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఇది ఇలా ఉ ండగా వైదిక కార్యక్రమాలు పార్నంది చంద్రశేఖర్ శర్మ, సిరిసిల్ల రాంప్రసాద్ శర్మ, మధు గౌతమ్ శర్మ, మోతే సాయి శర్మ, కొరిడే గణేష్ శర్మ కశుజ్జుల చంద్రశేఖర్, జన్మంచి సుధీర్ శర్మ లు నిర్వహించగా వాసవి క్లబ్, వనిత సభ్యులు, ఇరుకుల్ల నాగభూషణం పద్మజా దంపతులు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలు



**జగిత్యాల ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

పట్టణంలోని గోవిందుపల్లి, చిలుకవాడ అంగన్వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమము నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమములో భాగముగా గర్భిణిలకు శ్రీమంతాలు నిర్వహించటం జరిగింది. తల్లిపాల వారోత్సవాల సంబంధించి పోస్టర్స్, వీడియోలను అందిరి ముందు ప్రదర్శింపచేసి తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించటం జరిగింది. తల్లిపాలే బిడ్డకు దేవుడు ఇచ్చిన వరం అని తల్లులకు తెలుపుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొలగాని ప్రేమలత, సూపర్వైజర్ రాణి, స్వరూపరాణి, అంగన్వాడి టీచర్లు గంగ జమున, హరిత, పవిత్ర, తల్లులు పాల్గొన్నారు.

# వారాసిగూడ లో బాలిక అదృశ్యం



**సికింద్రాబాద్ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఓ బాలిక అదృశ్యమైంది. వారాసిగూడ ఇన్స్పెక్టర్ పి.శంకర్ కథనం ప్రకారం.... భరత్ కుమార్ యాదవ్ కూతురు నూనేటి వరిణి (11) అనే విద్యార్థిని శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని తాత ఎన్. కొమురయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తెలిసినవారు, ఇతర ప్రాంతాల్లో వెతికిన కనిపించలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ. శంకర్ తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

నార్కట్‌పల్లి, : మండలంలోని అమ్మనబోలు-పొడిచేడు గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అమ్మనబోలు గ్రామస్థులు డిమాండ్ చేశారు. అమ్మనబోలులో ఎడ్లబండ్లను రోడ్డుకు అడ్డంగా నిలిపిన గ్రామస్థులు సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మూసీ వాగునుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సర్పంచ్ భర్త బద్దం రాంరెడ్డి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాపై అంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేద్దామని సముదాయించారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేయడంతో రాస్తారోకోను విరమించారు. మూసీ వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజ మానుల నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ. 10వేల చొప్పున వసూలు చేయాలని 10రోజుల క్రితం గ్రామానికి చెందిన ముఖ్యులు సమావేశమై నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి ట్రాక్టర్ యజమానులు కూడా అంగీకరించినట్లు సమాచారం. అయితే గ్రామ పంచాయతీకి సంబంధం లేకుండా ముఖ్యులందరితో కమిటీ ఏర్పాటుచేసి ఆ కమిటీకి డబ్బులు చెల్లించడం



ద్వారా సమకూరే నిధులను గ్రామంలో గుళ్లు, గోపురాలు, బడుల్లో మౌలిక సదుపాయాల కోసం వెచ్చించాలని నిర్ణయించినట్లు వినికిడి. ఇదిలా ఉంటే ట్రాక్టర్ యజమానుల నుంచి డబ్బు తీసుకుని ఇసుక లోడ్లకు అనుమతిస్తే తమ సంగతేంటని గ్రామానికి చెందిన ఎడ్ల బండ్ల యజమానులు శుక్రవారం రోడ్డెక్కినట్టు అంతా చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో కొందరు యువకులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వారితో గొంతుకలిపారు. ఇదిలా ఉండగా, మూసీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాలో సర్పంచ్‌కు మామూళ్లు అందుతున్నాయని ఇటీవల నిర్వహించిన గ్రామసభలో కొందరు ఆరోపించినట్టు తెలిసింది. ఈ ఆరోపణలపై స్పందించిన సర్పంచ్ భర్త రాంరెడ్డి ఇసుక అక్రమ రవాణాకు ట్రాక్టర్ యజమానులు తనకు డబ్బులు ఇచ్చారనే విషయాన్ని ఖండిస్తూ శివాలయం వద్ద ప్రమాణం చేసినట్లు సమాచారం.

# ప్రధాని నరేంద్ర మోడీకి పాలాభిషేకం




**జనగామ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

అమృత భారత్ పథకంలో భాగంగా జనగామ రైల్వే స్టేషన్ సుందరికరణలో 24.5 కోట్ల రూపాయలు అంజూరు చేస్తూ ఆదివారం ఉదయం 11 గంటలకు వారం వర్చువల్ గా భారత ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేస్తున్న సందర్భంలో భారత ప్రధాని నరేంద్ర మోడీకి బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త అధ్యక్షతన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.... జనగామ రైల్వే స్టేషన్ కు 24.5 కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం సుందరీకరణ కోసం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జనగామ స్టేషన్కు ఇన్సైడ్ నుండి అవుట్ సైడ్ వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్స్ లెటర్ లిఫ్ట్ ల్యాండ్ స్కేప్ తో పాటు స్టేషన్ లో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతాయని ఈ అభివృద్ధి వలన భవిష్యత్తులో వ్యాపారస్తులకు ఉపయోగపడే విధంగా వ్యాపారం చాలా పెరుగుతుందని, వేలాదిమందికి ఈ స్టేషన్ ఉపయోగపడుతుందని, జనగామ ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండవ ఫేసులో జనగామ స్టేషన్ కు మరొక 75 కోట్లు కూడా సుందరీకరణ కోసం మంజూరు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, సీనియర్ నాయకులు కీర్తి నర్సయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి సంపత్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు తోకల హరీష్, గణపురం కార్తీక్ పెద్దోజు జగదీష్, గోధుమల అశోక్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



భారతీయ జనతా పార్టీ జగిత్యాల దళిత మోర్చా అధ్యక్షులు నక్క జీవన్ తల్లి అనారోగ్యానికి గురి కాగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన బిజెపి జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ చిలుకమర్రి మదన్ మోహన్, ఆయన వెంట దళిత మోర్చ నాయకులు హరి కిరణ్, కళ్యాణ్ బాబు తదితరులు ఉన్నారు.

# సెకండ్ ఏఎన్ఎం లను పర్మినెంట్ చేయాలని బిఎస్పి జనగామ జిల్లా ఆద్వర్యంలో ఇన్చార్జి నీర్మాల రత్నం డిమాండ్



**జనగామ ఆగస్ట్ 05 (ప్రజామంటలు)**

జనగామ జిల్లా కేంద్రంలో ప్రిష్టన్ స్కూల్ మైదానం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి డిఎం అండ్ హెచ్ఓ కు ఎస్పి జనగామ జిల్లా ఆద్వర్యంలో వినతిపత్రం. పాల్గొన్న జిల్లా ఇన్చార్జి నీర్మాల రత్నం, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వాగళ్ళ సిద్దయ్య, నియోజకవర్గ ఇన్చార్జి జేరుపోతుల కుమార్, ఇరుగు మహేందర్, మాడిపడిగ చంద్రశేఖర్, నాగులపల్లి అశోక్, జిలుకర రవికుమార్, ఆకారపు దేవయ్య, రొడ్డ సుధాకర్, కొంపల్లి బిక్షపతి.

# బోధనకు దూరంగా భాషా పండితులు



ఆదిలాబాద్ పాలనాప్రాంగణం: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పదో తరగతి విద్యార్థుల చదువు లకు ప్రతిబంధకంగా తయారైంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో బదిలీ ప్రక్రియతో ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించని పరిస్థితి నెలకొనడం ఫలితాలపై ప్రభావం చూపుతుందన్న భయం వెంటాడుతోంది. వేసవిలో జరపాల్సిన బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం కిందటి నెల 28 నుంచి శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి పాఠశాల ఎలాగూ వదులుతున్నామని కొందరు, పదోన్నతి వస్తుందని మరికొందరు, బదిలీ అయితే ఎక్కడికి వెళ్తామని భావనలో ఇంకొందరు ఉండటం పాఠశాలల్లో బోధన పూర్తిగా గాడితప్పింది. మరోవైపు పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ శతశాతం పాఠ్యప్రణాళిక పూర్తిచేయలేదు. ఉదయం, సాయంత్రం పూట విద్యార్థులకు రోజుకో సబ్జెక్టు చొప్పున ప్రత్యేక పునశ్చరణ తరగతులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సరిపడా సబ్జెక్టు టీచర్లు లేకసర్దుబాటు చేసి పది విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న సమయంలోబదిలీ ప్రక్రియకు తెరలేపడంతో ఉపాధ్యాయులు దరఖాస్తులు, పరిశీలన, అభ్యంతరాల పేరిట డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకోవైపు పదోన్నతులలో తమకు అవకాశం ఇవ్వలేదనే ఆవేదనతో భాషా పండితులు 9, 10వ తరగతులకు బోధించడం లేదు. ఫలితంగా పదోతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# పట్టాలెక్కనున్న మూడోలైను పనులు

ఆసిఫాబాద్: ఉత్తరాది రాష్ట్రాలను అనుసంధానించే కాజీపేట- బల్లార్ష రైల్వేలైన్ అత్యంత రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో మూడోలైన్ పనులను దశాబ్దం క్రితమే ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా రెండేళ్ల పాటు పనుల పురోగతిలో అంతరాయం కలిగింది. తాజాగా కేంద్ర బడ్జెట్లో రూ. 450.86 కోట్లు కేటాయించడం వల్ల పనులు వేగం పుంజుకోనున్నాయి. 235 కి.మీ. పొడవునా ఉండే ఈ లైన్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లా మందమర్రి నుంచి ఉప్పల్ వరకు, మహారాష్ట్ర మానిక్‌ఘర్ నుంచి వీరూర్ వరకు 110 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. వీరూర్ నుంచి రెబ్బెన మండలంలోని ఆసిఫాబాద్ రోడ్ వరకు 125 కి.మీ. మేర పనులు సాగుతున్నాయి. 2015-16 బడ్జెట్లో ఈ మార్గానికి రూ. 2063 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం కేటాయించిన నిధులతో రాఘవపురం- పొట్కపల్లి, వీరూర్- మానిక్‌ఘర్ మార్గంలో విద్యుత్తు లైన్ పనులు చేయనున్నారు. 2021-22 బడ్జెట్లో ఈ మార్గానికి రూ. 485 కోట్లు కేటాయించారు. అటవీ అనుమతులు, టైగర్ రిజర్వ్,



కొవిడ్ కారణంగా కుమురం భీం జిల్లాలో పనులు ఆలస్యమయ్యాయి. కాజీపేట- బల్లార్ష మార్గంలో ఉన్న రెండో రైల్వే లైన్ నిరంతరం రద్దీగా ఉండడంతో ప్రయాణికులు గమ్యస్థానానికి చేరడానికి గంటల తరబడి ఆలస్యం అవుతోంది. సింగరేణి బొగ్గును తీసుకెళ్లే రైళ్లు, సిమెంటు గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు ఈ ప్రాంతం నుంచి వెళ్లడానికి సిగ్నల్ కోసం చాలా సమయం వేచి చూడాల్సి వస్తోంది. తాజాగా నిధుల కేటాయింపుతో పనులు వేగంపై ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా ఆత్మహత్యాయత్నం ప్రమేయంలో పోలీసుల తప్పిదం లేదు -డిఎస్పి వెంకటస్వామి

గొల్లపల్లి (ప్రజా మంటలు ఆగస్టు 5): గొల్లపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట నల్లగుట్ట ప్రాంతానికి చెందిన దండ్ల కనకలక్ష్మీ అనే మహిళ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటనకు పోలీసుల నిర్లక్ష్యం,అలసత్వం ప్రదర్శించారు అనడం వాస్తవ దూరమని జగిత్యాల డిఎస్పి వెంకటస్వామి పేర్కొన్నారు .మహిళ ఆత్మహత్యాయత్నం సంఘటనపై డిఎస్పీ కార్యాలయం శనివారం ప్రెస్ నోట్ విడుదల చేసింది. కనుకలక్ష్మీ తన కూతురు స్వరూపను కోరుట్ల మండలం తిమ్మయ్య పల్లి గ్రామానికి చెందిన పల్లెపు మహేందర్ అనే యువకుడు లైంగికంగా వేధిస్తున్నారని గత జూన్ 25న గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు .అయితే నిందితుడు కేసు నమోదు చేసినప్పటి నుంచి తప్పించుకోని తిరుగుతుండగా పోలీసులు అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈక్రమంలో జులై 30న కోరుట్ల పట్టణంలో గొల్లపెల్లి ఎస్సై అనుమాండ్ల నరేష్ అతడిని అదుపులోకి తీసుకొని అతడికి



సెక్షన్ 41 ఏ సిఆర్పీసి నోటీసు ఇచ్చి ఆగస్టు 2 న గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో హాజరు కావాలని సూచించారు .అయితే పోలీసుల సూచన బేకథారు చేసి స్టేషన్కు హాజరు కాకపోవడంతో జగిత్యాల 2 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ గారికి నేను తుడిని అరెస్టు చేసెందుకు అనుమతిని కోరడం జరిగింది

మెజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు నిందితుడిని పట్టుకుని రిమైండర్కు తరలించినట్లు అందులో డిఎస్పి తెలిపారు .బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడంతో పాటు నిందితుడు పరారీలో ఉండడంతో అతని కోసం గాలింపులు చర్యలు చేపట్టి పోలీసులు సమర్థవంతంగా నిర్వహించినప్పటికి సదర్ మహిళా క్షణికావేశానికి లోన అఘాయిత్యానికి పాల్పడిందని పేర్కొన్నారు . చట్ట ప్రకారము నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు.

# గురుకులానికి స్వచ్ఛ నజరానా



లక్షెట్టిపేట:పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం స్వచ్ఛ గురుకులంగా రాష్ట్ర స్థాయిలో మెరిసి పురస్కారాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ గురుకుల్-2022 స్పెషల్ డ్రైవ్‌లో 168 గురుకులాల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందింది. నగదు బహుమతిగా రూ. 50 వేలు కైవసం చేసుకోవడం విశేషం. అంతకు ముందు జిల్లా స్థాయిలోనూ మొదటి బహుమతితో రూ. 20 వేలు పొందింది. స్వచ్ఛ గురుకుల్-2022 స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో చెత్త ఏరివేయడం, పాఠశాల భవనం, డార్మిటరీలు శుభ్రపర్చడం, మరుగుదొడ్లు, మూత్రశాలలతో పాటు నీటి తొట్టిలను శుభ్రపర్చడంలాంటి కార్యక్రమాలు నిర్వహించారు.వంటగది, భోజన శాలలను శుభ్రపర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో పచ్చదనం కోసం మొక్కలు నాటారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడా నికి వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వహించిన స్వచ్ఛ గురుకుల్- 2022 పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది. గతంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించా ము. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతోనే అవార్డు సాకారం అయ్యింది. భవిష్యత్తులో ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తాం.

# 'పోడు' భూముల సమస్య తీరేనా?



సిరిసిల్ల :పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడానికి సంవత్సర కాలం క్రితం దరఖాస్తులు తీసుకున్న రైతులకు, గిరిజనులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. గతేడాది నవంబరులో తీసుకున్న దరఖాస్తులపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో 67 బృందాల ద్వారా సర్వే చేశారు. ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను పొందుపర్చారు. ప్రభుత్వం పోడు సమస్య పరిష్కారం కోసం చర్చలు జరిపినా ప్రతి సారీ సమస్య తీరుతుందని ఆశలు పెంచుకుంటూనే ఉన్నారు. మళ్లీ పోడు పట్టాలు అందించే దిశగా చర్యలు ప్రారంభం కావడంతో పోడు రైతుల్లో ఆశలు మొదలయ్యా యి. దశాబ్దాల కాలంగా పోడు సమస్య ఉన్నా దరఖాస్తుల పరిశీలన జరిపి అందులో గిరిజనులకు ముందుగా హక్కు పత్రాలు అందించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీ తరువాత ముఖ్యమంత్రి పట్టాలు అందిస్తారని గిరిజన శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ ఇటీవల ప్రకటిం చడంతో గిరిజనుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గిరిజ నేత రులకు మాత్రం ఎదురు చూపులు తప్పవా అని చర్చిం చుకుంటున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వ ంలో డివిజన్ స్థాయిలో కమిటీలు సిఫార్సు చేసిన దరఖాస్తులను పరిశీలించి అర్హులం దరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 7వ తేదీలోగా గిరిజనుల దరఖాస్తులను మరోసారి పరిశీలించ నున్నారు. జిల్లాలో ఎనిమిది మండలాలు, 67 గ్రామాల్లో పోడు సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా గిరిజనుల కంటే గిరిజనేతరుల నుంచి దరఖా స్తులు ఎక్కువగా రావడం గమనార్హం. జిల్లాలో 12 మండలాలు ఉండగా పోడు సమస్య ఉన్న ఎనిమిది మండలాల్లోని 67 గ్రామాల్లో గతేడాది సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సహాయకులు, అటవీ బీట్ అధికారి, మండల సర్వేయర్లతో బృందాలు ఏర్పాటు చేశారు. గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 2005కు పూర్వం, 434. 80 ఎకరాల భూమి పోడుకు గురవగా తరువాత 7588.40 ఎకరాల్లో ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన పూర్తి చేశారు. పోడుభూములపై ఆధారపడి ఉన్నవారి కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగమున్నా అనర్హులుగానే చూస్తున్నారు. గిరిజనులైతే 25 ఏళ్లపాటు, గిరిజనేతరులైతే 75 ఏళ్ల పాటు పోడు సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపిం చాల్సి ఉంది. రైతు కుటుంబానికి గరిష్ఠం పది ఎకరాలకు మించి ఉన్నా దానిని స్వాధీనం చేసుకోవాలని సర్కారు నిర్ణయించింది. అటవీ హక్కుల గుర్తింపుపోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వనున్నారు. 29 డిసెంబరు 2006 నుంచి ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం అమల్లోకి వచ్చింది. 2005కు ముందు సాగులో ఉన్న గిరిజనులకు మాత్రమే హక్కు పత్రాలు జారీ చేయనున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్నవారిని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ముందుకు వెళ్లనున్నారు.

# అదనపు ఆదాయంపై బల్దియా ఫోకస్

కరీంనగర్ : నగరపాలక సంస్థ అదనపు ఆదాయాలపై దృష్టి సారిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్, రిటైల్‌కు సంబంధించిన దాదాపు 10 వేలకుపైగా ఉన్న వాణిజ్య, వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సులను జారీ చేస్తే ఏటా బల్దియాకు లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్సులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు అప్పగించడంతో చాలా మంది వ్యాపారులు వాటిని తీసుకోవడం లేదు. దీంతో నగరపాలక సంస్థకు ట్రేడ్ లైసెన్సు ద్వారా వచ్చే లక్షల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా జారీ చేసి పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నప్పటికి వాటిపై ఇప్పటి వరకు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఇటీవల ట్రేడ్ లైసెన్స్‌తోపాటు అన్ని రకాల ఆదాయాలను పెంచుకొని నగర అభివృద్ధికి వాటిని వినియోగించుకోవాలని పాలకవర్గం తీర్మానిం చింది. మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలో ట్రేడ్ లైసెన్స్ జారీపై కమిషనర్ సేవా ఇస్లావత్‌తోపాటు ఇతర అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ట్రేడ్ లైసెన్సుల జారీపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం నగరంలోని రెవెన్యూ, శానిటరీ, ఇతర విభాగాలకు చెందిన 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆయా బృందాలకు ప్రాంతాలను కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో వంద శాతం ట్రేడ్ లైసెన్స్ జారీ చేసిన అధికారుల బృందానికి బహుమతి ఇస్తామని, లైసెన్సుల జారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జనవరి 11వ తేదీ నుంచి ఆయా బృందాలు నగరంలోని అన్ని దుకాణాల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్సుపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ కోసం గతంలో మాదిరిగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లి ఆ దుకాణం ఉన్న రోడ్డును బట్టి,ఏరియాను బట్టి అప్పటికప్పుడే ఫీజును నిర్ధారించి ఆ డబ్బులు చెల్లించిన వెంటనే లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. 20 రోజులుగా ఈ ప్రత్యేక బృందాలు వ్యాపార వర్గాలకు అవగాహన కల్పించడంతో 1,592 మంది వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకున్నారు. దీంతో నగరపాలక సంస్థకు 33,18,121 రూపాయల ఆదాయం సమకూరింది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేస్తుండడంతో ఫిబ్రవరి, మార్చి రెండు నెలల కోసం ఇప్పుడు తీసుకోకుండా ఏప్రిల్‌లో తీసుకుంటే సరిపోతుందని పలువురు వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో లైసెన్స్ జారీ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగడం లేదు. లైసెన్స్‌లు తీసుకున్న వ్యాపారులు ఏప్రిల్‌లో రెన్యూవల్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. వ్యాపారులందరూ విధిగా లైసెన్స్‌లు



తీసుకోవాలని బల్దియా అధికారులు వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,428 మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకున్నారు. మరో 10వేల మంది వరకు ఇంకా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవలసి ఉంటుంది. మార్చి 31వ తేదీ వరకు ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్‌ను జారీ చేస్తే నగరంలోని మొత్తం వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎన్ని ఉన్నాయనే లెక్కతోపాటు ఎంత ఆదాయం వస్తుందో తేలిపోతుంది. ఆ తర్వాత రెన్యూవల్ ఫీజు కూడా వస్తుందనే భావనతో బల్దియా అధికారులు ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

# ఓట్ల కోసం దుబారా పథకాలు!

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న అనేకానేక ఉచిత కార్యక్రమాల ద్వారా ఒక్కో కుటుంబానికి అంతోఇంతో మేలుజరుగుతోంది. ఓ రకంగా చెప్పాలంటే మీరు ఓట్లేయాల్సిందే..మేము మీకు ఫలాలనా మేళ్లు చేస్తున్నామన్న రీతిలో పోటీపడి పథకాలను వరదలా పారిస్తున్నారు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న డబ్బులు పందేరం చేస్తున్నారు. ఎపిలో సిఎం జగన్ బటన్ నొక్కితే..కెసిఆర్ బటన్ నొక్కకుండానే పంచుతున్నారు. ఇందులో అనేక పథకాలు ఉన్నాయి. దీంతో ఖజానా ఎప్పుడో ఖాళీ అయ్యింది. అప్పులు భూతంలా వెంటాడుతున్నాయి. ఇదేమిటని అడిగితే ..అప్పులు చేయకుంటే ఎలా అని పాలకులు ఎదురుదాడి చేస్తున్నారు. అప్పులతో ఆస్తులు సృష్టిస్తున్నామని, పేదల కడుపు నింపుతున్నామని ఘనంగా చెప్పుకుంటున్నారు. సబ్సిడీ పథకాలకు ప్రజలను అలవాటు చేసి వారిని నిర్వీర్యులుగా చేయడంలో ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు దొరకడం కష్టంగా మారింది. వ్యవసాయ కూలీల సంగతి చెప్పనక్కర్లేదు. జిఎస్టీతో ఆదాయం పెరిగిందని చంకలు గుద్దుకుంటున్న కేంద్రం కూడా దుబారా ఖర్చులు మాత్రం తగ్గించుకోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకం వల్ల పన్నులు కట్టలేక మధ్యతరగతి ప్రజల నడ్డి విరుగుతోంది. పన్నులు కట్టే ప్రజలకు జవాబుదారీ లేకుండా పోతోంది. ధరల విషయంలో పల్లెలకు పట్టణాలకు తేడా లేకుండా పోయింది. కూలీనాలీ చేసుకునే వారు కిక్కులేనిదే ఉండడం లేదు. దీంతో సంపాదించిన దాంట్లో అధిక భాగం తాగడానికే తగలేస్తున్నారు. ఉపాధిహామీ కింద నిర్మాణాత్మక పనులు చేయించాలన్న డిమాండ్‌పై కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం లేదు. వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న వినతులను పక్కన పెట్టింది. ఉపాధి హామీకింద ఏటా వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా ..పనికి తగ్గట్లుగా చేసిన పనులు జరగడం లేదు. దీనిని సమీక్షించాలన్న కనీస పరిజ్ఞానం కూడా ప్రభుత్వానికి కలగడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కరువయ్యారు. 132 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో కూలీలు ఎందుకు దొరకడం లేదన్న విషయం ప్రపంచాన్ని సైతం ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని ఎలా అధిగమించాలో ఆలోచన చేయడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా రూపాయికే కిలో బియ్యం పథకాన్ని కొనసాగించడం సబబుకాదని గుర్తించడం లేదు. రూపాయి బియ్యం తినేవారు ఇప్పుడు రాష్ట్రాల్లో లేరు. ఈ పథకాన్ని పునః సమీక్షించడం వల్ల వేలకోట్ల రూపాయల వృధాను అడ్డు కోవచ్చు. అయినా సమీక్షించడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సాహసించడం లేదు. రూపాయికి కొత్తతిమీర కట్ట కూడా రాని రోజుల్లోఈ పథకం కోసం వేలకోట్లు ప్రజల ధనాన్ని దుబారా చేస్తున్నారు. ఈ బియ్యం పథకం ప్రభుత్వాలకు గుదిబండగా మారినా ఓటు బ్యాంక్ కోసం దీని జోలికి వెళ్లడం లేదు. ఓట్లతో ముడిపడి ఉన్న ఈ పథకాన్ని తొలగించాల్సిందే. తెలుగు రాష్ట్రాల ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతున్న కిలో రూపాయి బియ్యాన్ని తక్షణం తొలగించడం ద్వారా ప్రజల సొమ్ముకు రక్షణగా నిలవాలి. బహిరంగ మార్కెట్‌లో కిలో 60 రూపాయల బియ్యం అమ్ముతున్నారు. ఇంత వ్యత్యాసంతో బియ్యం అందిస్తున్నా పేదలు ఈ బియ్యాన్ని అమ్ముకోవడం ద్వారా వ్యాపారాం చేస్తున్నారు. ఆర్థిక మాంద్యంతో అతలాకుతలం అవుతున్న ప్రస్తుత తరుణంలో ఈ పథకంపై సమీక్షించి అక్రమాలను అరికట్టాలి. కొందరికి ఈ పథకం వరంగా మారింది. బియ్యాన్ని హోళ్లకు అమ్ముకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. మరోవైపు కిలో రూపాయికే ఇస్తున్న చౌక బియ్యం అక్రమంగా రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయి. పేదలు కడుపునిండా తినాలన్న ఈ పథకం ఇప్పుడు కొందరికి వ్యాపారంగా మారింది. మరికొందరికి ఆదాయ వనరుగా మారింది. అలాగే రీసైక్లింగ్ పేరుతో సన్నబియ్యంగా మార్చి అమ్ముకునే వ్యాపారంగా మారింది. చెక్‌పోస్టులు,తనిఖీ కేంద్రాలు, పోలీసులు ఉన్నా బియ్యం రవాణాను అడ్డుకోలేకపోతున్నారు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

## ప్రేమకు ప్రతి రూపం

# వెన్నెల మనసు...



"బావా ఎలా ఉన్నావ్ బాగున్నావా !సమయానికి తింటున్నావా ఉద్యోగం ప్రిపరేషన్ లో పడి నీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నావా? ఎప్పుడొస్తావు , నీ రాక కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నీవు ఈసారి ఉద్యోగం సంపాదించాలని నేను మొక్కని దైవం లేదు. నీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది అని"మీ ఫోన్లో తాను మాట్లాడాలనుకున్న మాటలన్నీ చెప్పింది వెన్నెల.

దానికి సూర్య నేను బాగున్నాను. వెన్నెల నా గురించి నువ్వు ఏం కంగారు పడకు, నేను బాగా చదువుతున్నాను, సమయానికి తింటున్నాను.ఉద్యోగమే నా జీవిత లక్ష్యం నీకు తెలుసు కదా.అనే సమాధానం చెప్పాడు."బావ కళ్ళల్లో ఉన్నట్టు ఉన్నావు సరే నేను ఎలాగో అలాగా ఉంటాను" కానీ నువ్వు జాగ్రత్త అంటూ ఉంటాను అని ఫోన్ పెట్టేసింది.

వెన్నెల ,సూర్య ఇద్దరు బావ మరదళ్లు చిన్నప్పటినుండి వాళ్ళిద్దరూ ప్రేమగా ఉండేవారు.ఒక్కరంటే ఒకరికి పంచ ప్రాణాలు.ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు.10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్న పల్లెటూరు పిల్ల వెన్నెల.చదువు ఆపేసి ఇంట్లో బీడీలు చుడుతూ ఉండేది. కానీ సూర్య మాత్రం పట్నంలో పెద్ద చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం కష్టపడుతున్నాడు. ఉద్యోగం వచ్చాక వెన్నెలను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. బావ సంతోషం కోసం సరేనని, ఉద్యోగం వచ్చాకే పెళ్లి చేసుకుంటానని ఒప్పుకుంది.

వెన్నెల చదివింది తక్కువే కానీ అన్ని విషయాలు తెలిసిన అమ్మాయి. అసలు సిసలైన పల్లెటూరి వేషధారణలో పరికిణీ లో చాలా అందంగా కనిపిస్తుంది.అమాయకపు మాటలు చలాకీగా ఉంటూ అందరినీ నవ్విస్తూ ఉండేది. ఇదే బావ సూర్యకు చాలా నచ్చింది. అందుకే మరదలు కోసం పరితపిస్తాడు. తన బావతో మాట్లాడకుండా ఒక రోజు కూడా ఉండలేదు. అందుకే కనీసం రోజుకు ఒక్కసారైనా పట్నంలో ఉన్న తన బావకు ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుంటుంది. లేకపోతే తన మనసు కుదుటపడేది కాదు.

సూర్య రాత్రింబవళ్లు బాగా కష్టపడి, ఉద్యోగం కోసం పరీక్ష రాసాడు. నెల రోజుల్లో ఫలితాలు వస్తాయి పట్టణం నుండి తను ఊరికి చేరుకున్నాడు. ఫలితాలలో సూర్యకు మంచి ఉద్యోగం వచ్చింది. అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తన బావకు ఉద్యోగం వచ్చిందని వెన్నెల తాను మొక్కిన మొక్కులను దేవుళ్లకు చెల్లించింది. సూర్య నిజామాబాద్ జిల్లాకు డిప్యూటీ తహసిల్దారుగా వెళ్లిపోయాడు. తన బావ తనని విడిచి ,ఉద్యోగం కోసం దూరంగా వెళుతున్న బాధ ఎక్కువైంది. వెన్నెలకు ఊరడించి చెప్పాడు.

రెండు సంవత్సరాలు పూర్తయితే సొంత జిల్లాకు రావచ్చు. అప్పుడు మనం అనుకున్నట్టు పెళ్లి చేసుకుందామని మాట ఇచ్చి వెళ్లిపోయాడు. ఇది విన్న వెన్నెల ఒక కంటి నుండి ఆనందభాష్పాలు, మరో కంటి నుండి సంతాప బాష్పాలు వచ్చాయి.సరేనంటూ బావ సూర్య ను సాగనంపింది .ఇలా కొద్ది రోజులు గడిచాయి.

రోజుకొకసారైనా ఫోన్ చేసి మాట్లాడే వెన్నెలతో సూర్య సరిగా మాట్లాడడం లేదు. ఒక్క రింగుతో ఫోన్ లిఫ్ట్ చేసే తన బావ ఇప్పుడు నాలుగు ఐదు సార్లు ఫోన్ చేసినా తీయట్లేదు. మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. ఇది వెన్నెల ను ఎంతో కుంగ తీసింది. తన బావ అలా తనతో ప్రవర్తించడం ఎంత మాత్రం తట్టుకోలేకపోయింది. రాత్రుల్లో ఒంటరిగా కూర్చొని ఏడ్చే.ది తన బావ ఎందుకోసం అలా చేస్తున్నాడు అని ఆలోచిస్తూ కలత నిద్రపోయేది.దసరా పండక్కి ఊరొచ్చిన తన బావ ను నిలదీసి అడిగింది.తనతో ఇంతకు మునుపులాగా చలాకీగా ఉండట్లేదు, మాట్లాడడం లేదని .అప్పుడు సూర్య ఏమి సమాధానం చెప్పలేక, దాటవేసేవాడు .ఇది వెన్నెలను మరింత నైరాశ్యం లోకి నెట్టివేసింది.

దసరా పండుగ రోజు సూర్య వెన్నెలకు ఫోన్ చేసి గుడి దగ్గరకు రమ్మని చెప్పాడు, తనతో ముఖ్యమైన విషయం చెప్పాలని. ఎగిరి గంతులు వేసిన వెన్నెల సరేనని గుడి దగ్గరికి వచ్చింది. అక్కడ తన కోసం ఎదురుచూస్తున్న బావ పక్కన కూర్చుంది."బావ ఫోన్లో ముఖ్య విషయం అని చెప్పావు కదా" ఏమిటని సూర్య కళ్ళల్లోకి చూసి ప్రశ్నించింది. ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైంది వెన్నెల. తన బావ కళ్ళల్లో నుండి కన్నీటి వర్షం. "ఏమైంది బావ ఎందుకోసం ఏడుస్తున్నావు" అని తన చేతిని బావ చేతిలో వేసి అడిగి%శీ%ది. నోటి నుండి మాట పెగల లేదు.ఒక్కసారిగా గట్టిగా వెన్నెలను కౌగిలించుకొని బోరున విలపించాడు. వెన్నెల కూడా అనుకోకుండా ఏడ్చింది.

ఆ అమర ప్రేమికుల రోదన నుండి కొద్దిసేపటికి ఇద్దరు తేరుకున్నారు. వెన్నెలతో అసలు విషయం చెప్పాడు. నిన్ను పెళ్లి చేసుకోవడం మా నాన్నకు ఎంత మాత్రం ఇష్టం లేదని, ఉద్యోగం ఉన్న అమ్మాయిని చేసుకోవాలని నన్ను బలవంతం పెడుతున్నారు. నేను ససేమీరా? అన్నాను. నేను వెన్నెల తప్ప ఎవరిని పెళ్లి చేసుకోనని చెప్పాను. అమ్మది కూడా నా మాటే. నాన్న మాత్రం కరా ఖండిగా చెప్పేశాడు. ఇంకోసారి వెన్నెలతో ఫోన్లో కూడా మాట్లాడొద్దు. నా మాట జవదాట వద్దని హెచ్చరించాడు.

ఈ విషయం చెప్పగానే వెన్నెల చాలా బాధపడింది. కానీ సూర్య మాత్రం వెన్నెల నీతోనే నా జీవితం, నీవు లేనటువంటి ఈ ప్రాణం నాకు గడ్డి పోచతో సమానం. నువ్వు లేని జీవితాన్ని తట్టుకోలేను అని చెప్పాడు.

వెన్నెల తెలివైన అమ్మాయి. తన మీద బావకు ఇంత ప్రేమ ఉందని తెలుసుకొని ఆనందపడిన, ఆ ప్రేమ తనకు కలకాలం దక్కదని నిర్ణయించుకుంది. తన బావగారి తండ్రి కోరిక ప్రకారం, ఉద్యోగం ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకొమ్మని వేడుకుంది .

"బావ నేను పల్లెటూరి పిల్లను. మామూలుగా చదువుకున్న దాన్ని కదా. నువ్వు నాకు దక్కకపోతే ఏంటి నీ గుండెల్లోన చోటిచ్చావు. ఈ జీవితానికి నువ్వే నాకు సర్వస్వం.జీవితాంతం ఇలా ఏకాకిగా నిన్ను , నీ జ్ఞాపకాలను తలుచుకుంటూ, జీవితాన్ని గడుపుతాను" అనగానే సూర్య ఆశ్చర్యపోయాడు.

మీ నాన్నగారి కోరిక నెరవేర్చు. మీ కుటుంబంలో నువ్వు సంతోషాన్ని ఇవ్వాలి అని వెన్నెల చెప్పింది. ఉద్యోగం ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తనమీద ఒట్టేసి చెప్పమని సూర్యుని బలవంతం చేసింది. తన సంతోషం కోసం ప్రేమను త్యాగం చేస్తున్న వెన్నెలను చూసి ,సరే అంటూ ఒట్టేసి చెప్పాడు.


చివరగా వెన్నెల వెళుతూ" బావా ఒక్క మాట. అంటూ ఈ విషయం మన ఇద్దరి మధ్య ఉండాలి ఎవరికీ తెలియకూడదు అని చెప్పి వీడ్కోలు చెప్పి మౌనంగా వెళ్ళిపోయింది.

–యాడవరం చంద్రకాంత్ గౌడ్
సిద్దిపేట, 9441762105

# "యాచక దశ నుండి తెలంగాణ శాసక దశకు రావాలి"

## ఆగష్టు 6... ప్రొఫెసర్ జయశంకర్ జయంతి
## "కొత్తపల్లి జయశంకర్ యాదిలో జీవిత విశేషాలు"

తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగష్టు 6, 1934– జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్ డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్– ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పేవారు. జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు.




1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించు కోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు.

బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. "అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్ధనా" (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ, ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన. తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు.

"మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!" అని ఉద్యమాన్ని శ్వాసించిన మహెరీపాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్, రెండేళ్లు గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 6 మంగళవారం రోజున తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు. చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు.

అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో "విప్లవ విద్యార్థి ఉద్యమానికి" కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితీవేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

# శిశు మరణాలు దేశ భవితకు శాపాలు..!

ప్రతి వెయ్యి మంది జన్మించిన 5 ఏండ్ల లోపు శిశువుల్లో మరణించిన వారి సంఖ్యను శిశు మరణాల రేటు(ఇన్ఫాంట్ మోర్టాలిటీ రేట్, ఐయంఆర్)గా వర్ణిస్తారు. దేశ శిశు మరణాల రేటు ఆధారంగా ఆ దేశ ప్రజల ఆరోగ్య సంక్షేమం ఉంటుందని మనకు తెలుసు. ఇటీవల విడుదల చేసిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం ప్రస్తుత శిశు మరణాల రేటు 28 (ప్రతి 1000 శిశు జననాల్లో 28 మరణాలు) ఉందని తెలుస్తున్నది. గత వివరాల ప్రకారం భారత దేశ శిశు మరణాల రేటు 44 నుంచి నేడు 28కి తగ్గించడం కొంత విజయమే అయినా ఈ సమస్యను ప్రధానమైందని తలచి మరింత కృషి చేయాల్సి ఉందని గమనించాలి. యూనిసెఫ్–2020 నివేదిక ప్రకారం శిశు మరణాల రేటు అతి తక్కువగా ఉన్న దేశాల జాబితాలో 1.54తో ఐస్‌లాండ్, 1.56తో సాన్ మరీనో, 1.65తో ఎస్టోనియా, 1.76తో స్లోవియా, 1.79తో నార్వే, 1.82తో జపాన్, 1.85తో సింగపూర్, 1.88తో ఫిన్‌లాండ్, 1.95తో మాంటెనిగ్రో, 2.15తో స్వీడెన్‌లు ఆదర్శంగా నిలుస్తున్నాయి. 2022లో ప్రపంచ దేశాల సగటు శిశు మరణాల రేటు 27 ఉంది. అత్యధిక శిశు మరణాల రేటు నమోదైన దేశాల జాబితాలో సియెరా లియోన్‌లో 80, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో 76, సొమాలియాలో 73, నైజీరియాలో 72, కాంగోలో 64, సౌథ్ సూడాన్‌లో 63, మాలిలో 59 అగ్రభాగాన నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 5 ఏండ్ల లోపు వయస్సు ఉన్న శిశువుల్లో ఏడాదికి 4 మిలియన్లు (75 శాతం) మరణాలు నమోదు అవుతున్నాయి. 2020లో తొలి మాసంలోనే 2.4 మిలియన్లు, 1 మిలియన్ తొలి గంటలో (5 ఏండ్ల లోపు మరణాల్లో 47 శాతం) శిశు మరణాలు నమోదు కావడం విచారకరం. ఆఫ్రికన్ ప్రాంతంలో ఏడాది లోపు శిశువుల మరణాల రేటు 52 ఉండగా, యూరోప్ ప్రాంతంలో 7 ఉన్నది.

గ్రామీణ భారతంలో ఐయంఆర్ 48 నుంచి 31 వరకు, పట్టణాల్లో 29 నుంచి 19 వరకు తగ్గడం గమనించారు. అంతర్ రాష్ట్రాలు, పట్టణాలు, గ్రామాల మధ్య శిశు మరణాల రేటులో వ్యత్యాసాలు కొన్ని ప్రమాదకర వాస్తవాలను వెల్లడిస్తున్నాయి.

## బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లత కి వినతి పత్రం



**జగిత్యాల ఆగస్టు 05 (ప్రజామంటలు)**

భారతీయ జనతా యువమోర్చ జిల్లా అధ్యక్షులు రెంటం జగదీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం యువత, నిరుద్యోగులు వందలాది మంది పోరాడి ప్రాణం త్యాగం చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్లు అవుతున్న ఉద్యోగ నియామక లేక నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్న ఆత్మహత్యలు చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరత్తినట్టుగా వ్యవహరిస్తుందన్నారు. ఎలక్షన్లు వస్తేనే హామీలు ప్రవేశపెట్టి వాటిని నెరవేర్చే చిత్తశుద్ధి ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. 2018 ఎన్నికల్లో యువతకు ప్రతినెల 3,016 రూపాయలు నిరుద్యోగ భృతి చెల్లిస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు నిరుద్యోగ భృతి కి ఎటువంటి నిధులు ప్రకట చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తుందన్నారు. ఇలానే రాష్ట్రంలోని నిరుద్యోగులను నోటిఫికేషన్ వేయకుండా నిర్లక్ష్యానికి వివక్షకు గురి చేస్తే రాబోయే రోజుల్లో ప్రతి ఒక్క నిరుద్యోగి భుజం తట్టి రాష్ట్ర ప్రభుత్వాన్నికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి మంచే రాజేష్, బీజేవైఎం జగిత్యాల జిల్లా కోశాధికారి గుర్రం రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కురుమ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత అనిల్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి అరుణ్ యాదవ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కొండ్ర రవితేజ, జగిత్యాల అర్బన్ మండల అధ్యక్షులు అజయ్, సారంగాపూర్ మండల అధ్యక్షులు దీటి వెంకటేష్ ప్రధాన కార్యదర్శి చుక్కల ప్రేమ్ సాగర్, బీజేవైఎం అర్బన్ ప్రధాన కార్యదర్శి శేఖర్, పట్టణ ఉపాధ్యక్షులు కూసరి మహేష్, వినీత్ గౌడ్, నిఖిల్, ఆనంద్ సింగ్, అఖిల్, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబర్ పేట ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కోటి గాజుల మహోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి నిర్వాహకులు ఇరుకుల్ల నాగభూషణం పద్మజ దంపతులు అమ్మవారి శేష వస్త్రాన్ని సమర్పించారు. బ్రాహ్మణ ఆశీర్వచనం చేశారు.

## 6వ రోజుకు చేరుకున్న భాగవత సప్తాహ్న నయజ్ఞం



**జగిత్యాల ఆగస్టు 05 (ప్రజామంటలు)**

అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తి పాటలతో కోలాటలాడారు. భాగవత సప్తాహ్న యజ్ఞం ఆరో రోజుకు చేరింకోంన సందర్భంగా స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఉయ్యాలను ప్రత్యేకంగా అలంకరించి శ్రీకృష్ణ భగవానుని విగ్రహం ఉయ్యాలలో హాసినిలు చేసి మాతలు కోలాటాలు ఆడారు. ఈ సందర్భంగా గత సోమవారం ప్రారంభమైన భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం ఈరోజు 6వ రోజుకు చేరింది. శృంగేరి శారదాపీఠం ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి చే ప్రవచనాలు శ్రీకృష్ణ లీలలు, గోవర్ధనోత్సవం ఘట్టాలను భక్తులకు వివరించారు. శ్రీకృష్ణ జననం బృందావనాన్ని తలపించింది. గురూజీ కూడా మాతలతో కోలాటాలు ఆడారు. విశేష సంఖ్యలో మాతలు భక్తిశ్రద్ధలతో కోలాటాల ఆడుతూ నృత్యాలు చేస్తూ మండపంలో భక్తి పాటలతో మారుమోగాయి ప్రతి రోజు అధిక సంఖ్యలో మాతలు, ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్య ప్రవచనాలు భక్తి శ్రద్ధలతో వింటున్నారు. విచ్చేసిన భక్తులకు అల్పాహారం, సాయంత్రం భోజనం ప్యాకెట్లను, అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఊటూరి అశోక్ బాబు, రమాదేవి, ఓంకార్ నాథ్, నవత సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, చెట్ల చంద్రశేఖర్, భక్తులు, మాతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శక్తి పంచాయతన త్రయాహ్నిక పంచకుండాత్మిక మహాశక్తియాగం పూర్ణాహుతితో సంపూర్ణం





**కోరుట్ల టౌన్ ఆగస్టు 04 (ప్రజామంటలు)**

కోరుట్ల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవిద్యాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన త్రయాహ్నిక పంచకుండాత్మిక మహాశక్తి యాగం చివరి రోజు స్థాపిత దేవతలపూజ, శక్తి పంచాయతనార్చన, సప్తశతి చండీహోమం, నవగ్రహశక్తి పంచాయతన మూలమంత్ర హోమం పంచగుండాలలో హోతలు యాగం నిర్వహించారు. వేదపండితులు పారాయణాలు,అష్టాక్షరి మంత్రజపాలు నిర్వహించగా అనంతరం చివరి ఘట్టం మహాపూర్ణాహుతిని శ్రీవిద్యా ధురంధరులు,మాన్యశ్రీ గంగావరం నారాయణశర్మ గారు నిర్వహించారు. భారతీయ సనాతన వైదిక సంప్రదాయానికి వేదాలే మూలమని నారాయణశర్మ ప్రవచించారు. అనంతరం నిర్వాహకులు పాలెపు నర్మదా రాజేశ్వరశర్మ, శ్యామ సుందరశర్మ, దివ్యా శివరామకృష్ణ శర్మ దంపతులు, సత్యనారాయణ శర్మకు గురువందనం సమర్పించారు. మహదాశీర్వచనం తీర్థప్రసాద వినియోగం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, మహాదాతలు, బిజెపి రాష్ట్ర నాయకులు, కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ సురభి నవీన్ కుమార్, మీడియా ప్రతినిధులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# వంగపహాడ్ లో ఆదిమానవుల అడుగు జాడలు

### - డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి

**జనగామ ఆగస్టు 05 (ప్రజామంటలు)**

వంగపహాడ్ గ్రామం రెడ్ లైట్ ఏరియా కాదని అదొక చారిత్రక ప్రాంతమని పురావస్తు పరిశోధనల ద్వారా తెలుస్తున్నది. గుట్ట పైన



సుమారుగా మూడు వేల ఏళ్ల కిందటి రాతియుగం నాటి మానవులు జీవించినట్లుగా తెలిపే చారిత్రక ఆధారాలను డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి, రజాక్ తో కలిసి క్షేత్ర పర్యటనలో గుర్తించారు. ఈ విషయాలు జనగామలో శనివారం వెల్లడించారు. వంగపహాడ్ గ్రామము మీదుగా వెళ్ళే జాతీయ రహదారికి అనుకుని రంగనాయకుల గుట్ట ఉంది. ఈ గుట్ట కారణంగా గ్రామ నామం ఏర్పడింది. పహాడ్ అనగా గుట్ట. గుట్ట ముందు భాగంలో ఎత్తు ఎక్కువ ఉండడం కారణంగా వెనుకవైపు గుట్ట కనిపించదు. వంగినట్టు ఉందని భావించి "వంగ పహాడ్ " గ్రామ నామం స్థిరపడింది. గుట్టపై గుహలో రంగనాయకుడు విష్ణు మూర్తి లక్ష్మీ దేవి సమేతంగా కొలువు తీరిన శిల్పం ఉంది. ఎదురుగ ఇద్దరు ఆళ్వారు శిల్పాలు ఉన్నాయి. రంగ నాయకుల గుహ ఉండటం వల్ల రంగనాయకుల గుట్టగా పిలుచుకుంటారు. గుట్ట చుట్టూ అడవి,మూడు వైపుల ఊర చెరువు, చింతల చెరువు, బాబాయ్ చెరువు ఉండటం, సమీపం నుండి వాగు



ప్రవహించడం వల్ల ఆది మానవులు నివసించడానికి , వ్యవసాయము చేసుకోవడానికి అనువుగా ఉంది. గుట్ట కేంద్రంగా 3000 సంవత్సరాల క్రితం నాటి నుండే నవీన శిలాయుగం నాటి ఆది మానవులు జీవించారు. వీరు రాతి పనిముట్ల తయారీలో నిపుణులు. రాతి పనిముట్లను పట్టుకోవడానికి వీలుగా మరియు మరియు ఎక్కువ కాలము ఉపయోగించుకునేందుకు అనువుగా తయారు చేసుకున్నారు. వీటి తయారి కోసం గుట్టల సమతల ప్రాంతాలను, పరుపు బండలను ఎంచుకున్నారు. రాతి పనిముట్ల తయారు చేసుకునే చోటా పొడవైన, మరియు వెడల్పైన బద్దులు (గ్రూవ్స్) ఉన్నాయి. ఇవి సుమారుగా 3000 సంవత్సరాల క్రితం నాటివి. గుట్టపైన ఉన్న పొయ్యి రాళ్ళ బండను ఎక్కి చుస్తే గ్రామ సౌందర్యము, చుట్టూ ఉన్న వాగులు, పొలాలు,మెలికలు తిరిగే దారి కనిపిస్తుంది. బాబాయ్ చెరువు, వాగు సమీపంలో కుమ్మరి గడ్డ అని పిలిచే ప్రాంతంలో వీరు నివసించారు. ఈ గుట్ట జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం వల్ల ప్రకృతి ప్రేమికులు సందర్శించడానికి అనువుగ మార్చుకోవచ్చునని రత్నాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# రెండవ ఏఎన్ఎం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయ్యాలి

### - మాజీ ఎమ్మెల్యే సిహెచ్. రాజారెడ్డి



**జనగామ ఆగస్టు 05 (ప్రజామంటలు)**

రాష్ట్రంలో ప్రాణాలకు తెగించి ప్రజల జీవితాలను కాపాడుతున్న రెండవ ఏఎన్ఎం, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వెంటనే రెగ్యులర్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఏఐటీయూసీ ఇచ్చిన పిలుపులో భాగంగా రెండవ ఏఎన్ఎం, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బంది భారీ ఎత్తున ప్రిస్టియన్ గ్రౌండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రెండవ ఏఎన్ఎం జిల్లా నాయకురాలు కవిత అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... వెంటనే ప్రజల కొరకు అహోరాత్రులు కష్టపడి పనిచేస్తు, ప్రజల ప్రాణాలు కాపాడుతున్న రెండవ ఏఎన్ఎం ను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి వారిని కూడా రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఎందుకు మంచి అవకాశం కల్పిస్తున్న, ప్రధానంగా ఆకురాత్రులు కష్టపడుతున్న ఈ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వారి కుటుంబ జీవితాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐటియూసి రాష్ట్ర పిలుపులో భాగంగా జనగామలో ఇంత పెద్ద భారీ సంఖ్యలో పాల్గొన్న ప్రతి కార్యకర్త తెగింపుతో ఉద్యమంలో పాల్గొన్నందుకు అభినందనలు తెలిపారు. కవిత మాట్లాడుతూ.... కరోనా సమయంలో కూడా మేము భయపడకుండా ఎంతో మంది ప్రాణాలు కాపాడమని ఎంతో ధైర్యంతో ప్రజలకు 24 గంటల సేవలందిస్తున్న మా కుటుంబాలకు మా వాళ్లకు రక్షణ కల్పించి తక్షణం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మేమంతా నిరవధిక సమ్మె చేసిన పోరాట సాధించుకుంటామని కార్యకర్తలు ఎంతో ధైర్యంతో ఉద్యమంలో పాల్గొన్నారని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.... సమస్య సాధించేంతవరకు ఎగదాటిపై ఉండి ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం డిఎంహెచ్వో జిల్లా అధికారి ప్రశాంత్ కి తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరచాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కె. రాజ్యలక్ష్మి, శిరీష, అనిత, కవిత, లత, ఉజ్వల, మంజుల, సునీత, ధనలక్ష్మి, వనజ తదితరులు పాల్గొన్నారు.

## 18న జనగామ జిల్లా విద్యార్థి యువగర్జన మహాసభజనగామ విద్యార్థి జేఏసీ



**జనగామ ఆగస్ట్ 05 (ప్రజామంటలు):**

జనగామ జిల్లా కేంద్రంలో స్థానిక ఏబీవీ జూనియర్ కళాశాలలో సమావేశమైన జనగామ జిల్లా విద్యార్థి జేఏసీ నాయకులు 18న జరిగే విద్యార్థి యువగర్జన మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు మాట్లాడుతూ.... జనగామలో విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి ఈ విద్యార్థి పోరాటం ఎంతో దోహదపడుతుందని, జనగామ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాల నుండి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి జేఏసీ కన్వీనర్ పిట్టల సురేష్ మాట్లాడుతూ.... జిల్లా ఏర్పడ్డాక జనగామ విద్యారంగంలో తీవ్రంగా నష్టపోయిందన్నారు. తెలంగాణ సాధించిన స్ఫూర్తితో జనగామ జిల్లా సాధించిన స్ఫూర్తితో మరోసారి జనగామ విద్యా వ్యవస్థ రక్షణకై విద్యార్థి సంఘాలు అన్ని ఏకమై పోరాటం చేయాలని నిర్ణయించి 18న విద్యార్థి యువగర్జన మహాసభ ఏర్పాటు చేయనుందని, విద్యాసంస్థలందరూ సహకరించి జనగామ విద్య వ్యవస్థ రక్షణకు భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజివిపి జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వేంపటి అజయ్, విఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కొండ్ర ప్రవీణ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన ఎస్ఈ జి. సత్యనారాయణ



**గొల్లపల్లి ఆగస్టు 05 (ప్రజామంటలు)**

గొల్లపల్లి మండలంలోని రెండు విద్యుత్ సెక్షన్ల పరిధి లోని గంగాపుర్, శెకెళ్ళ, వెనుగుమట్ల, లొత్తునూర్ యశ్వాంతరావు పేట్, బొంకూర్ గ్రామాలలో వర్షాలు, వరదలకు విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లింది. శనివారం జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి. సత్యనారాయణ ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పునరుద్దరణ పనులను పరిశీలించారు. ఇట్టి భారీ వర్షాలకు గొల్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో 232 పోల్లు, 11 విద్యుత్ నియంత్రికలు పడైనట్లు అధికారుల అంచనా ప్రకారం సుమారు 30లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు తీవ్ర నష్టం జరిగినప్పటికీ లైన్లను పునరుద్ధరించి కొద్ది రోజుల్లోనే విద్యుత్ సరఫరాను కొనసాగిస్తామని తెలిపారు. డిఈ గంగారాం, ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈలు దివాకర్ రావు, మునిదర్ రెడ్డి, సబ్ ఇంజనీర్లు మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీఓ కు స్వాగతం తెలిపిన జగిత్యాల టిఎన్జీవోలు



**జగిత్యాల ఆగస్టు 05 (ప్రజామంటలు)**

ఇటీవలే పదోన్నతిపై మెటుపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ దూలం మధు ని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్చం అందించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీఓ దూలం మధు మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో మెటుపల్లి డివిజన్ ను అన్ని రంగాల్లో ముందు ఉంచడానికి కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షులు యం.డి. వకీల్, టిఎన్జీఓ నాయకులు అమరేందర్ రెడ్డి, రాజేందర్, ముదాం రవి, శ్రీనివాస్, భాస్కర్, శ్రీలత పాల్గొన్నారు.




హైదరాబాద్ కు చెందిన జీవన్ సాథీ చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి డాక్టర్ యతీంద్ర రెడ్డి జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సిద్దెంకి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ. పాల్గొన్న ట్రస్ట్ ప్రతినిధులు జనార్ధన్ రెడ్డి, వెంకటమ్మ, యతీంద్రరెడ్డి, యశ్వంత్ రెడ్డి, లయన్స్ క్లబ్ జనగామ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు.

## అధికారుల అనధికారిక చర్యలతో

# అన్నదాతల ఇబ్బందులు

### ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో క్రయ విక్రయాల నిలిపివేత

**- ఉపాధి కోల్పోతున్న హమాలీలు, ఇతర కార్మికులు**



ఖమ్మం : రాష్ట్రంలోని ప్రధాన వ్యవసాయమార్కెట్లలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఒకటి. కానీ అధికా రులు తీసుకుంటున్న అనధికారిక నిర్ణయాలతో రైతులు, మార్కెట్‌లోని హమాలీలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మార్కెట్‌లో ప్రతీ మిర్చి పంట తప్ప అపరాలు, పత్తి కొనుగోళ్లు యథావిధిగా జరిగేవి. కానీ మూడు, నాలుగు నెలలుగా రోజున పత్తి, అపరాల యార్డులకు కూడా ఎలాంటి సమాచారం, ప్రకటన ఇవ్వకుండానే సెల వులు ఇస్తుండటంతో విషయం తెలియక పంటలు అమ్ముకునేందు కు వస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తమకు వచ్చే ఉపాధి నష్టపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ సెలవు దినాలు, ఆదివారం మాత్రమే సెలవులు ఉండి.. మిగతా రోజుల్లో క్రయవిక్రయాలు జరగాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా వారంలో ఐదు రోజులు మాత్రమే మార్కెట్ యార్డులను నడిపిస్తుతండటంతో సుదూర ప్రాంతాల నుంచి పంటలను అమ్మకానికి తీసుకువచ్చే రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అదీగాక శని, ఆదివారాలు వరుసగా సెలవులు ఉంటుండటంతో ప్రతీ సోమవారం పంట ఎక్కువ మొత్తంలో వస్తుండటంతో వ్యాపారులు అదు ను చూసి ధర తగ్గిస్తున్నారు. ఫలితంగా రైతులకు ఆశించిన మేర ధరలు దక్కడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రతీ మార్కెట్‌లో మిర్చి పంట మినహాయించి పత్తి, అపరాలు లావాదేవీలు యథావిధిగా జరిగేవి. ఇటీవల సెలవని ఎవరికి తెలియకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి పంటలను మార్కెట్ తీసుకొచ్చిన రైతులు మార్కెట్ మూసి ఉండటంతో తమ పంటలను వెనక్కు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు భరించలేక ఇక్కడే దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వారికి తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే మార్కెట్ అధికారుల నుంచి అధికారికంగా పత్తి, అపరాల యార్డులకు సెలవు ప్రకటించకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని మార్కెట్‌లో పని చేసే కార్మికులు సెలవుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌కు అప్రకటిత సెలవు ఉండటంతో మార్కెట్‌లో పని చేసే సుమారు 2 వేల మంది కార్మికలు ప్రత్యక్షంగా ఉపాధి కోల్పోతుండగా, మార్కెట్ ఉత్పత్తులపై ఆధారపడే చిన్న చిన్న పరిశ్రమలలో పని చేసే హమాలీలు, మహిళలు సుమారు వెయ్యి మందికి పైగా ఉపాధిని కోల్పోతున్నట్టు సమాచారం. కాగా రైతుల ఇబ్బందుల దృష్ట్యా మార్కెట్‌ను యథావిధిగా నడిపించాలని రైతులు, కార్మికులు, రైతు సంఘాలు కోరుతున్నాయి. నిత్యం పంటలతో కళకళలాడే మార్కెట్ సెలవు ఉండటంతో కళ తప్పిందని పలువురు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో పత్తిని కొనుగోలు చేసే వ్యాపా రులకు (పత్తి ట్రేడర్లకు) చెల్లించిన జీఎస్టీ మళ్లీ చెల్లించాలని నోటీసులు రావడంతో వారు నిరసనగా గతంలో సుమారు 15 రోజుల పాటు పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపి వేశారు. అనంతరం వారికి జీఎస్టీ నోటీసుల వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో శనివారాలు క్రయవిక్రయాలు నిలిపేయాలని నిశ్చయించుకోవడంతో వారికి చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు కూడా అండగా నిలవడంతో మార్కెట్‌ను అప్రకటిత బంద్ పెట్టినట్లు తెలుస్తోంది

# 'బాలవెలుగు'పై నిర్లక్ష్యపు చీకట్లు

**- ఉపాధ్యాయులు, సిబ్బందికి 11నెలలుగా అందని వేతనాలు**

**-నిధులు రాక సందిగ్ధంగా పాఠశాలల నిర్వహణ**



ఖమ్మం: సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా పాఠశాలలు లేని మారుమూల గ్రామాల్లోని చిన్నారులకు అ,ఆల నుంచి ఐదోతరగతి వరకు విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో 1995లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బాలవెలుగు పాఠశాలలపై నిర్లక్ష్యపు చీకట్లు కమ్ముకున్నాయి. ఉపాధ్యాయులు, సిబ్బందికి వేతనాలు రాక.. నిర్వహణకు నిధుల్లేక నీరసించిపోతున్నాయి. ఈ పాఠశాలలు ప్రారంభమైన తొలిఏడాదిలో ఉమ్మడి జిల్లాలో 32 వేల మంది విద్యార్థులు చదువుకోగా.. అధికారుల కృషితో ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం 1,168కు చేరుకుందంటే.. రోజురోజుకు వీధిబాలల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనం. ఇందులో అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి ఎంతో దాగిఉంది. అలా ఇన్నేళ్లుగా విజయవంతంగా నడుస్తున్న బాలవెలుగు పాఠశాలల మనుగడ ప్రస్తుతం కష్టంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 35 బాలవెలుగు పాఠశాలలుండగా.. వలస కుటుంబాలకు సంబంధించిన పిల్లలు ఒక్కో పాఠశాలలో 25 నుంచి 30మంది వరకు చదువుతున్నారు. మొత్తం 74మంది ఉపాధ్యాయులు, 15 మంది అసిస్టెంట్ క్లర్కులు, 38మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఉపాధ్యాయులు ఒక్కొక్కరికి నెలకు రూ.7వేలు, సహాయకులకు రూ.3500వేతనాలు ఇస్తున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో బాలవెలుగు పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వలేదు. గతంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఇస్తున్నా స్థానిక అధికారి నిర్లక్ష్యంతో ఉపాధ్యాయులు పస్తులుంటున్నారు. దీంతో బాలవెలుగు ఉపాధ్యాయులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించడంతో 4 నెలల జీతాలను అందించారని పలువురు ఉపాధ్యాయులు వాపోయారు. పెండింగ్ వేతనాలతో పాటు గత 20 సంవత్సరాలుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గత సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధి కారిని పిలిచి వెంటనే వేతనాలు అందించాలని ఆదేశించారు. గతంలో ఈ బాలవెలుగు పాఠశాలలో చదువుకొన్న చిన్నారులు ప్రస్తుతం పాఠశాలలు మూతపడటంతో బాలకార్మికులుగా పనులకు వెళ్తున్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బాలవెలుగు పాఠశాలలను పునఃప్రారంభించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని పలువురు బాలవెలుగు ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు. జిల్లాలో బాలవెలుగు పీడీగా ఉన్న అధికారి బాలవెలుగు పాఠశాలలను తీసేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు వచ్చాయని చెబుతున్నట్టు సమాచారం. అయితే అలాంటి జీవో కానీ, ఉత్తర్వులు కానీ ఎక్కడా కనిపించడం లేదు. వాటిని ఇవ్వడానికి కూడా సదరు అధికారి ముందుకు రావడం లేదు. కేవలం నోటి మాటగా ఆదేశాలు జారీచేస్తూ చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిధులు, సామగ్రి ఇవ్వని కారణంగా పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. అయితే ఆదేశాలకు సంబంధించిన జీవో కాపీ కానీ, ఆర్డర్స్ కానీ చూపించాలని కొందరు ఉపాధ్యాయులు పీడీని కోరగా ఆమె చూపలేదని, దీంతో సదరు ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీ వచ్చే వరకు విధులకు హాజరవుతున్నట్టు తెలిసింది. ఆ పాఠశాలలో విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్న భోజనాన్ని కూడా అందించడంలేది తెలిసింది. విద్యార్థులే ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకోని పాఠశాలకు హాజరవుతున్నారు.

# భూముల అమ్మకంపైనే ఆదాయం ఆశలు



హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టబోతోంది. గత ఏడాది కంటే భారీగా పద్దులు ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఖర్చులు సరే.. మరి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది..? ఈ సందేహం అందరికీ వస్తుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం ఈ సారి ప్రజాకర్షక పథకాలను పెంచేందుకు ప్రజలపై ఓ మోస్తరుగా పన్నులు పెంచడంతో పాటు భూముల అమ్మి ఎక్కువగా నిధులు సమీకరించుకోవాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్నుల్లో తెలంగాణ వాటా 2.10 శాతం. ఈ ప్రకారం రూ.21,470 కోట్లు తెలంగాణకు వస్తాయి. వీటికి కేంద్ర ప్రభుత్వ పథకాలు.. ఇతర గ్రాంట్స్ కూడా కలిపి రాష్ట్రానికి రూ.38 వేల కోట్లు మాత్రమే అందనున్నాయి. అప్పుల పరిమితిపై కూడా కేంద్రం నియంత్రణ విధించనుంది. ఈ ఏడాది కార్పొరేషన్ల పేరుతో చేసిన అప్పులను కూడా పరిగణనలోకి తీసుకుని వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిబంధనల ప్రకారం రావాల్సిన అప్పులను కూడా నియంత్రించడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే.. బడ్జెట్‌లో ఎంత మేర అప్పులను లక్ష్యంగా పెట్టుకున్నా.. వాటి లక్ష్యం మేర బహిరంగ మార్కెట్ రుణాలను సాధించుకోవడం అంత తేలిక కాదు. తెలంగాణ ప్రభుత్వ ఆదాయం పెంపునకు రకరకాల మార్గాలను అన్వేషించినట్లుగా తెలుస్తోంది. అందులో ఇసుక లాంటి వాటి ధరల పెంపు దగ్గర్నుంచి చాలా మార్గాలను రెడీ చేసుకుంది. వరదల కారణంగా వాగులు, వంకలు, ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక భారీగా పేరుకుపోయింది. దీంతో కొత్తగా ఇసుక రీచ్‌ల వేలం, రాయల్టి పెంచే అవకాశం ఉంది. గతంలో భూములు, ఇండ్లు, ప్లాట్ల మార్కెట్ విలువలను రెండేళ్లకు పట్టణాల్లో, మూడేళ్ల కోసారి గ్రామీణ ప్రాంతాల్లో సవరించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఇటీవలే సవరించింది. ఎప్పుడైనా మార్కెట్ విలువలను పెంచుకునేందుకు వీలుగా ఈ నిర్ణ యం తీసుకోగా మరోసారి మార్కెట్ విలువల సవరణకు ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. తాజాగా స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖలో ఎల్‌ఆర్‌ఎస్‌లేని, అనుమతిలేని లే అవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిల్చిపోవడం, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో రాబడి తగ్గిపోవడంతో దీనిపై పున: సమీక్ష చేసి ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంది. హైదరాబాద్ శివార్లలో భూములను వేలం వేసి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు సమీకరించుకుంది. ఈ సారి జిల్లాల్లో కూడా భూములు వేలం వేయాలన్న ఆలోచన చేస్తోంది. నిరుపయోగ భూములు 32 జిల్లాల్లో గుర్తిం చిన వివరాల సేకరణ, అమ్మకం, రాజీవ్ స్వగృహ ఇండ్లు, కార్పొ రేషన్ పరిధిలోని భూముల అమ్మకం, దిల్‌కు సంబంధించిన భూములపై ఉన్న కేసును పరిష్కరించుకుని వీటి విక్రయాలు నిర్వహించి ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలిసింది. అదేవిధంగా పలు శాఖల్లో పేరుకుపోయిన బకాయిలు, వన్‌టైం సెటిల్‌మెంట్లకు ఉన్న అవకాశాలు, కేంద్రం వద్ద ఉన్న బకాయిలను వసూలు చేసుకునే అవకాశాలతో బడ్జెట్‌లో అంచనాలను ప్రతిపాదించనున్నట్లుగా తెలుస్తోంది.

### అభివృద్ధి పనులు ప్రారంబించిన ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి :కాసిపేట మండలంలో పలు అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య.మండలంలోని గట్రావుపల్లిలో 7 లక్షల 60 వేల రూపాయలతో హెల్త్ సబ్ సెంటర్ భవనం శంకు స్థాపన చేశారు, అనంతరం గట్రావుపల్లి నుండి సొనాపూర్ గ్రామా నికి వెళ్లే వంతెన పరిశీలించారు.సోనపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని బాదుగూడలో 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు, రొట్టేపల్లి గ్రామంలో పంప్ హౌస్ వద్ద కొమురం భీమ్ గారి విగ్రహ ప్రతిష్టాపణ చేసి నివాళులు అర్పించారు.పల్లంగూడ గ్రామంలో మన ఊరు–మన బడి, మన బస్తి–మన బస్తి కార్యక్రమంలో బాగంగా 23 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు.మండలంలో 58 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదిముభారక్ చెక్కులను ఎమ్మెల్యే చిన్నయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందచేశారు.ఈ కార్యక్రమాలలో ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ విక్రమ్ రావు, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీలు రామ్ చందర్, చంద్రమౌళి, సర్పంచ్ లు రాజు, సుశీల, విజయ, సంపత్ నాయక్,స్వప్న , జంగు, బాదు, కవిత , ఉప సర్పంచ్లు తిరుపతి , సుమన్, ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బోల్లు రమణా రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు పోషం, నాయకులు అనంత్ రావు, రామ్ చందర్ , ప్రేమ్ కుమార్ , సింగు, కార్యకర్తలు, ఎమ్మార్వో దిలీప్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## డయల్ 100ను వినియోగించుకోవాలి

ఎదులాపురం : జిల్లా ప్రజలందరు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు అసోసియేషన్ 2023 సంవత్సర నూతన క్యాలెండర్‌ను అధికారులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయంలో బాధిత ప్రజ లకు జిల్లా పోలీసులు అండగా ఉండాలన్నారు. ఆపత్కాలంలో డయల్ 100ను సంప్రదిస్తే ఐదు నిమిషాల లోపు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ డీఎస్పీలు వీ ఉమేందర్, పోతారం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ జే కృష్ణమూర్తి, రిజర్వ్ సీఐ డీ వెంకటి, ఎస్ఐ అన్వర్ ఉల్ హక్, అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, కే అనసూయ తదితరులు ఉన్నారు.డీసీఆర్బీ (డిస్టిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో) డీఎస్పీగా పోతారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ ఉదయ్ కుమార్ రెడ్డికి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. ఆసిఫాబాద్ జిల్లా డీసీఆర్బీ సీఐగా విధులు నిర్వర్తించి గత నెల 27వ తేదీన డీఎస్పీగా పదోన్నతి పొందారు.

# ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

**- పట్టణాల్లో అడ్డగోలుగా కొనసాగుతున్న భవన నిర్మాణాలు**


**- కొత్త మున్సిపల్ చట్టాన్ని సైతం లెక్కచేయని వైనం**



కామారెడ్డి : జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగు తున్నాయి. ఆయా పట్టణాల్లో కొత్తకొత్త కాలనీలు వెలుస్తుండడం, మున్సిపాలిటీ అంతకు అంతగా విస్తరిస్తుండడంతో భవన నిర్మాణాల సంఖ్య సైతం పెరుగుతోంది. అపార్ట్‌మెంట్‌ల కల్చర్ సైతం చాలానే వచ్చింది. అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం గత రెండేళ్ల కిందట కొత్త మున్సిపల్ చట్టాన్ని అమలు చేసింది. కానీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో ఈ చట్టం అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మూడు మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న పలుచోట్ల దరఖాస్తులను మున్సిపల్ అధికారులు తిరస్కరించినప్పటికీ ఆ నిర్మాణాలు కొనసాగు తునే ఉన్నాయి. స్థానిక నేతల అండదండలతో అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆయా మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల అనుమతులకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ విధానం అమలవుతునే ఉంది. ఆయా పట్టణాల్లో ఎవరైన నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతి కోసం మీ సేవలోని టీఎస్ బీపాస్ ద్వారా దర ఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణాలకు భారీగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం 120 గజాల స్థలం ఉన్నవారు ఇళు కట్టుకోవాలంటే 1.5 మీటర్ల సెట్‌బ్యాక్ వదలిపెట్టాలి. రోడ్డు 30 అడుగులు ఉంటే ఇరువైపుల 5 అడుగుల చొప్పున స్థలాన్ని మున్సిపాలిటీకి అటాచ్ చేయాలి. ప్రధాన రహదారి అయితే ఈ సెట్ బ్యాక్ మూడు మీటర్లు ఉండాలి. ఈ నిబంధనలు అన్ని కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్‌లు ఏర్పాటు చేస్తూ అందులో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్ల అంచువరకు నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా బల్దియాలో పార్కింగ్ స్థలాలు కనిపించడం లేదు. హెటల్‌లు, ఆసుపత్రులు, వ్యా పార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలల నిర్మాణాలు అయితే నూతన చట్టం ప్రకారం 25 శాతం స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఎక్కడా కూడా అమలు కావడం లేదు. పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్న జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో జీప్లస్ 2, జీప్లస్ 3, జీప్లస్ 4 అనుమతి తీసుకుని నిర్మించుకుంటున్న ఇళ్ల మీద నీళ్ల ట్యాంకుల నిర్మాణం పేరుతో అదనపు స్లాబ్‌లు వేస్తున్నారు. వాస్తవానికి ట్యాంక్ నిర్మిస్తే దాని కింద ఇంటి నిర్మాణం ఉండకూడదు. ఉంటే అదనపు గదిగా పరిగణిస్తారు. దీంతో దాని అక్రమ కట్టడం కింద లెక్క కడతారు. ఇలా అనుమతి ఒకలా తీసుకుంటూ నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. ఇలాంటి వాటిని కొందరు కౌన్సిలర్‌లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సదరు ఇంటి యజమానుల వద్ద లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ వారు అడిగినంత ఇవ్వకుంటే మున్సిపల్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి పనులు ఆపివేయిస్తున్నారు. దీంతో చేసేదేమిలేక సదరు యజమానులు స్థానిక కౌన్సిలర్‌లకు ముడుపులు ఇచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా కొందరు అయితే మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా కనీసం నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలకు చెందిన డ్రైనేజీ, రోడ్లను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. కానీ స్థానిక నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనుకడుగు వేస్తుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది.

# అభివృద్ధికి ఆటంకంగా నిధుల లేమి

**పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలు**



ఖమ్మం : దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఈ సారి బడ్జెట్‌లోనైనా పరిష్కారం దక్కుతుందని ఉమ్మడి జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండటం, సోమవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా నేతలు గళం వినిపించాలని, గత హామీలతో పాటు తాజా ఇచ్చిన హామీలను నెరవేర్చేం దుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు కేటాయింపు చేస్తారని ఆకాంక్షిస్తున్నారు. వచ్చేదిఎన్నికల ఏడాది కావడంతో.. ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు ప్రవేశపెట్టబోయే బడ్జెట్ అందుకు అనుగుణంగా ఓటర్లను ఆకట్టుకునేలా ఆకర్షణీయ పథకాలు తెస్తారని, సాగు, తాగు నీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉమ్మడిజిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ సాగునీటి ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి భారీగా నిధుల అవసరం ఉంది. గతేడాది జూనలోనే సీతారామా ద్వారా సాగునీరు అందాల్సి ఉన్నా కరోనా పరిస్థితులు, నిధుల సమస్యతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.13,500 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమై ఆరేళ్లు దాటింది. ఇప్పటి వరకు రూ.6,200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా సగం నిధులు మంజూరు కావాల్సిఉంది. ప్రస్తుతం రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషనతోపాటు ఆంధ్రాబ్యాంకు, పవర్ ఫైనాన్స కార్పొరేషన్ల ద్వారా రుణాలు తీసుకుని పనులు నిర్వహిస్తున్నారు. 36టీఎంసీలగోదావరి నీటిని నిల్వచేసేలా ఇక రూ.2,700కోట్లతో సీతమ్మసాగర్ పనులు చేపట్టారు. దీనిలో ఇప్పటి వరకు సుమారు రూ.500కోట్లు మంజూరయ్యాయి. ఈసారిబడ్జెట్‌లో నీటిపారుదల శాఖ సుమారు రూ.వెయ్యికోట్లు అవసరమని ప్రతిపాదన చేసినట్టు సమాచారం. ఖమ్మంజిల్లా పరిధిలో కూడా సీతమ్మసాగర్ కాలవను పాలేరుకు అనుసంధానం చేసే పనులకు రూ.500కోట్లపైగా నిధులు అవసరం ఉండగా.. ఇవన్నీ మంజూరైతేనే ప్రాజెక్టు లక్ష్యం పూర్తయ్యే అవకాశం ఉంది. అలాగే తాలిపేరు, పెదవాగు, కిన్నెరసాని, బయ్యారం చెరువు, వైరా, బేతుపల్లి, లంకాసాగర్, పాలేరు ఇరిగేషన ప్రాజెక్టుల ఆధునీకరణ పనులకు ప్రాజెక్టు నిర్వాహణ, నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆధునికీకరణకు నిధులు అవసం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో మెడికల్ కళాశాల ప్రారంభమవగా, ఖమ్మం మెడికల్ కళాశాల వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. అయితే కొత్తగూడెంమెడికల్ కాలేజీకి అధునాతన భవనాల నిర్మాణం, వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాల్సి ఉంది. అలాగే ఖమ్మం కళాశాల కోసం తాత్కాలికంగా ఖమ్మం పాత కలెక్టరేట్, జిల్లా ఆసుపత్రిలోని కొన్ని భవనాలను కేటాయించగా.. వచ్చే విద్యాసంవత్సరంనుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ భవనాల నిర్మాణానికి, వసతులకు, ల్యాబ్‌లు ఏర్పాటుకు రూ.వెయ్యికోట్ల వరకు నిధులు అవసరం ఉంటుంది. ప్రస్తుత అవసరాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపును బట్టి మెడికల్ కాలేజీలో సౌకర్యాలు ఏర్పడనున్నాయి. గతనెలలో సమీకృత కలెక్టరేట్ల ప్రారంభోత్సవాల కోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇరు జిల్లాలపై వరాల జల్లు కురిపించారు. కానీ వాటిని నెరవేర్చేందుకు అవసరమైన నిధుల కేటాయింపుపై ఎలాంటి ప్రకటనలు చేయలేదు. దీంతో ఈ బడ్జెట్‌లో వాటి ప్రస్తావన ఉంటుందని అంతా ఆశిస్తున్నారు. జనవరి 12న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా సీఎం వచ్చి పలు పనులకు, స్థానిక సంస్థలకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలో మైనింగ్ కళాశాలను పూర్తిస్థాయి ఇంజనీరింగ్ కళాశాలగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కానీ జీవో విడుదల చేయలేదు. దీనికోసం రూ.110కోట్లతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. ఇక జిల్లాలో 481 పంచాయతీలకుగాను ప్రతీ పంచాయతీకి రూ.10లక్షలు ఇస్తామనగా వాటి కోసం సర్పంచలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అలాగే పాల్వంచ, కొత్తగూడెం మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.40కోట్లు, ఇల్లెందు, మణుగూరు మునిసిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున మంజూరుచేస్తామని ప్రకటించారు. ఆ నిధులొస్తేనే అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంది. అలాగే కొత్తగూడెం జర్నలిస్టులకు ఇళ్లస్థలాల హామీ ఇచ్చినా జీవో ఇవ్వలేదు. జిల్లా అధికారులు సింగరేణి స్థలాన్ని పరిశీలించినా ఆ కలనెరుతుందో లేదోనన్న అనుమానాలున్నాయి

# పేరు ఘనం.. వసతి శూన్యం

## సమస్యల్లో ఇంటర్ మూల్యాంకన శిబిరం




కరీంనగర్: ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు. మార్చిలో వార్షిక పరీక్షలు. ఆ నెలాఖరులో మూల్యాంకనం. ఇది అధికారులకు సమస్యగా మారింది. కారణం కావాల్సిన భవనం లేకపోవడం. రాష్ట్రంలో రెండో మూల్యాంకన కేంద్రం కరీంనగర్. అత్యధిక సబ్జెక్టులు ఇక్కడే దిద్దుతారు. ఆ మేరకు వస తులు లేవిక్కడ. మూడు చోట్ల మూల్యాంకనం చేస్తారు. ఇంటర్ బోర్డు అధిక వ్యయం చేయాల్సిన దుస్థితి. వాస్తవానికి ఉన్నతాధికారులు స్పందించి చొరవ తీసుకుంటే భవన నిర్మాణం జరిగే అవకాశముంది. అంతకుముందు ప్రస్తుతం వినియోగిస్తున్న కార్యాలయం ఇంటర్ బోర్డు పేరిట మోటేషన్ కావాల్సి ఉంది. ఇందుకు లేఖలు ఒక శాఖ నుంచి మరొక శాఖకు తిరుగుతూనే ఉన్నాయి. స్టేప్‌కార్ కార్యాలయాన్ని ఇంటర్ విద్యకు కేటా యించారు. అయితే ఆ స్థలం, భవనం టీసీఐఐసీ (పరిశ్రమల శాఖ) ఆధీనంలో ఉంది. 2017 నుంచి అక్కడ డీవీఈవో కార్యాలయం కొనసాగుతోంది. ఇందుకు ఇంటర్ బోర్డు ఆస్తి పన్ను చెల్లించాలి. నగర పాలక సంస్థ నుంచి కార్యాలయానికి చెల్లించాలని నోటీసులు అందాయి. ఆ మొత్తం ఇంటర్ బోర్డు కమిషనర్ మంజూరు చేయాల్సి ఉంది. వినియోగిస్తున్న భవనం ఇంటర్ బోర్డు పేరిట మోటేషన్ చేస్తే సంబంధిత నిధులు లభిస్తాయని బోర్డు స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని డీఐఈవో కార్యాలయం నగర పాలక సంస్థ కమిషనర్‌కు లేఖ రాసింది. ఆ తర్వాత 2020 నుంచి మోటేషన్ కోసం కలెక్టర్‌కు లేఖలు రాశారు. 2022లో టీసీఐసీసీ జోనల్ మేనేజర్‌కు కలెక్టర్ నుంచి సిఫారసు వెళ్లింది. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు పరిశ్రమల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నేటికి సమస్య పరిష్కారం కాలేదు. పరిశ్రమల శాఖ మోటేషన్‌కు అనుమతిస్తే భవనం ఇంటర్ బోర్డు ఆధీనంలోకి వస్తుంది. అప్పుడు కావాల్సిన నిధుల మంజూరు చేయడంలో నగర పాలక సంస్థకు బకాయిపడ్డ రూ.5 లక్షలు చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. మూల్యాంక శిబిరానికి అనువుగా ఇక్కడ భవన నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. ఇందుకు ఇంటర్ బోర్డు కూడా సానుకూలంగా ఉంది. జిల్లా కలెక్టర్‌తోపాటు పరిశ్రమల శాఖ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తే సమస్య పరిష్కారమవుతుందని ప్రధానాచార్యులు, అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు. పాత జిల్లా కేంద్రాల్లో మూల్యాంకనం జరుగుతుంది. రాష్ట్రంలో వరంగల్ మొదటి స్థానంలో ఉండగా, కరీంనగర్ శిబిరం రెండో స్థానం ఉంది. ఇక్కడే 5 లక్షలకు పైగా సమాధాన పత్రాల మూల్యాంకనం చేస్తారు. అన్ని సబ్జెక్టులు కలుపుకొని సుమారు 2 వేల మంది అధ్యాపకులు పలు విడతల్లో 30 రోజులపాటు శ్రమిస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో సరిపడా వసతులు లేవు. వాస్తవానికి ఒకే చోట శిబిరం ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ మూడు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ముకరంపురలో ఇంటర్ విద్యా కార్యాలయం. దాని పక్కనే ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల. కార్యాలయంలో కొన్ని సబ్జెక్టుల అధ్యాపకులు పేపర్లు దిద్దేవారు. అక్కడే స్ట్రాంగ్ రూంతోపాటు పర్యవేక్షణ జరిగేది. ఆర్ట్స్ కళాశాలలో 30 గదుల్లో గరిష్ఠ అంశాల మూల్యాంకనం కొనసాగేది. ఏటా మూడు విడతల్లో ఆయా సబ్జెక్టుల సమాధాన పత్రాలను అధ్యాపకులు దిద్దేవారు. అయితే ఇప్పుడవి లేకపోవడం సమస్యగా మారింది. స్మార్ట్‌సిటీలో భాగం గా ఆర్ట్స్ కళాశాలను కూల్చివేశారు. ఇప్పుడక్కడ పార్కు నిర్మిస్తున్నారు. అప్పటి కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆర్ట్స్ కళాశాలకు ఇంటర్ విద్యా కార్యాలయం (ఆర్ఐవో) కేటాయించారు.

# ఆక్రమణల్లో నడక దారులు-జనం ఇబ్బందులు



మిర్యాలగూడ,:ఉపాధి, తదితర అవసరాల కోసం పట్టణాలకు వలస వచ్చే వారి సంఖ్య పెరిగి పోతోంది. వలస వచ్చే వారు పొట్టకూటి కోసమని పట్టణాల్లో తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో నడకదారులు, రహదారులే వారి అవసరాలకు వేదికలుగా మారుతున్నాయి. ఫలితంగా పట్టణాల్లో రహదారుల వెంట నడిచేందుకు సరిపడా నడకదారులు లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన పదేళ్లుగా గ్రామాలను వదిలి వలస వెళుతున్న వారితో పట్టణాల్లో జనసాంద్రత పెరుగుతోంది. ఉపాధి, పిల్లల చదువులు, గ్రామాల్లో పంటల పెట్టుబడి వ్యయం పెరిగి లాభాలు తగ్గిపోవటంతో ప్రైవేటుగా పనిచేసేందుకు పట్టణాలకు వలసలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ అద్దె ఇళ్లలో నివాసం ఉండటంతో పాటు, నిరుపేద కుటుంబాల వారు ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకుని సైతం జీవనం సాగిస్తున్నారు. పట్టణాల్లో చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వారు ఉదయం, సాయంత్రం వ్యాపారాలు చేసుకునే వారు, సీజనల్ వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పట్టణాల్లో అడ్డాలు తమవే అంటూ బల్లాలు, ఇతర సామగ్రి ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2009లో రూపొందించిన 'వీధి వ్యాపారుల హక్కుల పరిరక్షణ చట్టం'తో వీధి వ్యాపారులను పురపాలికల్లో గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు సైతం అందించారు. ఈ వ్యాపారులు ఎక్కడ వ్యాపారాలు చేసుకోవాలనే విషయమై 'విక్రయ జోన్'లను ఏర్పాటు చేశారు. గ్రీన్ జోన్, ఎల్లో జోన్, రెడ్‌జోన్‌ల పేరుతో వీధి వ్యాపారులు నిర్దుష్ట ప్రాంతాల్లోనే వ్యాపారాలు చేసుకునేలా నిబంధనలు విధించారు. కానీ ఈ నిబంధనలు ఆచరణలో ఏ మాత్రం అమలు కాకపోవటంతో రెడ్‌జోన్, ఎల్లో జోన్‌లలో సైతం రహదారుల వెంట నడకదారులపై నిత్యం వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పాత పురపాలికల్లో జనాభా 50 వేల నుంచి లక్షకు పైగా చేరుకోగా వ్యాపార వాణిజ్య పరంగా అభివృద్ధి చెందాయి. ఈ పురపాలికలకు నిత్యం డివిజన్‌లోని ఆయా ప్రాంతాల నుంచి వ్యాపార, వాణిజ్య, కుటుంబ అవసరాలకు వేలాది మంది వచ్చి వెళుతున్నారు. దీంతో ఇక్కడ సాధారణ వ్యాపారులకు దీటుగా వీధి వ్యాపారుల విక్రయాలు నిత్యం సాగుతుంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు చోటా మోటా నాయకులు ప్రధాన రహదారుల వెంట అడ్డాలను ఆక్రమించి నెలవారీగా చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. ప్రతినెలా రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు విస్తీర్ణాన్ని బట్టి అద్దె దండుకుని దందా సాగిస్తున్నారు. నడకదారుల ఆక్రమణలు తొలగించేందుకు పోలీసులు, పురపాలిక అధికారులు ప్రయత్నించినా రాజకీయ నాయకుల అడ్డంకులతో ఏళ్ల తరబడి దందా సాగుతోంది. ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో కూడా కనీసం రహదారులపై ఆక్రమణలు తొలగించలేని పరిస్థితి నెలకొన్న తీరుతో నిత్యం వేలాది మంది సాధారణ పౌరులు పట్టణాల్లోని వీధుల్లో నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బందుల పాలవుతున్నారు.

# మొక్కుబడిగా స్థాయీ సంఘాల సమావేశాలు



కరీంనగర్ :జిల్లాలోని వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించి అవసరమైన సూచనలు, తీర్మానాలు చేసి జిల్లా పరిషత్‌కు పంపించేందుకు నిర్వహించే స్థాయీ సంఘ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడుతున్నాయి. మూడు నెలలకొకసారి జరిగేవి కూడా వాయిదా పడడం, పూర్తి స్థాయిలో జరగకపోవడం విమర్శలకు దారితీస్తోంది. గత సమావేశంలో ఏడింటిలో ఐదు మాత్రమే మొక్కుబడిగా నిర్వహించారు. వ్యవసాయం, సంక్షేమ విభాగాలవి వాయిదా పడ్డాయి. నేడు (సోమవారం) జరిగే సమావేశాలు పూర్తి స్థాయిలో జరుగుతాయా? లేదా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకటో స్థాయీ సంఘం పరిధిలో ఆర్థిక ప్రణాళిక విభాగాలుంటాయి. జిల్లా పరిషత్ నిధులు చేపట్టి పనుల ప్రణాళికపై చర్చిస్తారు. రెండో దాంట్లో గ్రామీణాభివృద్ధి, అనుబంధ విభాగాలపై సమీక్షిస్తారు. మూడో దాంట్లో వ్యవసాయం, అనుబంధ విభాగాలపై చర్చిస్తారు. నాలుగులో విద్య, వైద్యం ఉంటాయి. ఐదులో స్త్రీ, శిశు సంక్షేమ విభాగాల శాఖలు, ఆరు, ఏడులో చేపట్టిన పనులను వివరిస్తారు. ఈ సమావేశాలలో ఆయా శాఖలపై చర్చించి సూచనలు అవసరమైన తీర్మానాలు చేశారు. ఈ సమావేశాలు అన్నింటికి ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరవుతారు. వ్యవసాయ స్థాయీ సంఘానికి వైస్ ఛైర్మన్ అధ్యక్షులుగా వ్యవహరించడం ఆనవాయితీ. సంక్షేమ విభాగాల కమిటీకి షెడ్యూల్ కులాల జడ్పీ సభ్యురాలిని ఎన్నుకుంటారు. మహిళా సంక్షేమానికి మగువలు అధ్యక్షులుగా ఉంటారు. మిగిలిన నాలుగు కమిటీలకు జడ్పీ ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహిస్తారు. కమిటీల్లో జడ్పీటీసీ సభ్యులు కో-ఆప్షన్ సభ్యులు శాసన సభ్యులుగా ఉంటారు. జిల్లా పరిషత్‌ల విభజన తర్వాత జిల్లాలు చిన్నవి కావడంతో ప్రతి కమిటీకి ఇద్దరు జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ మొత్తం మీద ముగ్గురు నుంచి నలుగురు సభ్యులుగా ఉంటారు. వీరి సమక్షంలో సమావేశాలు జరుగుతాయి. సభ్యులు, అధ్యక్షత వహించాల్సిన ఛైర్మన్లు గైర్హాజరు కావడంతో చాలా సమావేశాలకు వాయిదా పడుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా హాజరు కావడంలేదు. కమలాకర్, జీవన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, రవిశంకర్ ఒకసారి హాజరయ్యారు. కొందరు జిల్లా స్థాయి అధికారులు హాజరుకాక కింది స్థాయి వారిని పంపడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారికి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నారు.

# ఆన్‌లైన్లో జనన.. మరణాలు




నాంపల్లి,:గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి వివరాలను అంగన్‌వాడీ టీచర్ రికార్డులలో నమోదు చేసేవారు. కుటుంబీకులు పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వక లేఖ అందించి జనన, మరణ ధ్రువీకరణ పత్రం పొందేవారు. తాజాగా మారిన విధానం ప్రకారం సదరు అర్జీని మీ-సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ వివరాలు నిర్ధారించిన తర్వాత పంచాయతీ కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. దీనిని మీ-సేవ కేంద్రం నుంచి పొందాలి. గతంలో పురపాలికల్లో అమలు చేసిన ఈ పద్ధతిని ప్రస్తుతం గ్రామాలకు విస్తరించారు. జనన, మరణ వివరాలను కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ఏడాది పాటు పంచాయతీలోనే ఉంచుతారు. తర్వాత వాటిని తహసీల్దార్‌కు శాశ్వత ప్రాతిపాదికన అప్పగిస్తారు. అనంతరం దస్త్రాల్లో ఉన్న వారి వివరాలతో ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ఏళ్ల క్రితం మరణించిన వ్యక్తుల వివరాల సేకరణ కష్టమవడంతోపాటు న్యాయపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఈ విధానంతో ఈ సమస్యలకు పరిష్కారం దొరకనుంది. జనన, మరణాల పత్రాలు రాని పక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సహా ఇతర చిక్కులకు దారితీసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం కుటుంబ సభ్యులు మీ-సేవలో రూ.45 రుసుం చెల్లించి రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పత్రాలు తీసుకునే వీలుంది. మరణించిన వ్యక్తి పేరుతో ఒక్కసారి ధ్రువపత్రం జారీ అయితే ఎవరి ప్రమేయం లేకుండానే ఆసరా పింఛన్, రేషన్ బియ్యం, ఓటరు గుర్తింపు కార్డు రద్దవుతుంది. ఈ-పంచాయతీలు ఏర్పాటు చేసి కంప్యూటర్లు సరఫరా చేసినా.. వాటి నిర్వహణలో కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వలేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు లేకపోగా, మరికొన్నింటిలో అంతర్జాల సౌకర్యం లేదు. ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం పల్లె వాసులు ఆన్‌లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. తాజాగా జనన, మరణ ధ్రువీకరణ వినతులు ఇలానే వస్తున్నాయి. ఇప్పటికైనా కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తే పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుంది.

# అంచనాలకు మించి వరి సాగు




కరీంనగర్ మంకమ్మతోట: ఈ యాసంగిలో సైతం జిల్లా రైతులు వరి సాగు వైపే అధికంగా మొగ్గు చూపారు. గతేడాది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చింది. సందిగ్ధంలో కొందరు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లారు. ఈసారి అలాంటి ప్రకట న ఏమి చేయకపోవడంతో అంచనాలకు మించి వరి సాగు చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 2,46,893 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం నమోదైంది. ఈ యాసంగిలో 2,44,000 వరకు వరి విస్తీర్ణం ఉండవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకు మించి 2,54,015 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగు చేశారు. మరికొన్ని చోట్ల ఇప్పటికీ సాగుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మొత్తంగా అధికారుల అంచనాలకు మించి ఇప్పటికే 7 వేల ఎకరాల వరకు పెరగగా, మరో పక్షం రోజుల్లో వేసే నాట్లతో కలిపి గతేడాదితో పోల్చితే పది వేల ఎకరాలు అధికంగా సాగయ్యే అవకాశముందని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది అధిక వర్షాలు పడడంతో జిల్లాలో భూగర్భ జలాలపై బెంగ లేదు. అంతేగాకుండా కాళేశ్వరం పంపులు తిరిగి పనిచేయడంతో కాలువల కింద పంటలు వేసుకునే వారందరిలో నీటి విడుదలపై భరోసా వచ్చింది. సాగుకు సరిపడా విద్యుత్తు సరఫరా విషయంలో కూడా పెద్దగా ఇబ్బందులుండవనే హామీతో రైతుల్లో సాగుపై మరింత భరోసా కల్గింది. గత రబీ సీజన్‌లో వచ్చిన వరి ధాన్యాన్ని మొత్తంగా ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రైతుల్లో కొనుగోళ్లపై ఉన్న అపోహలు తొలిగిపోయినట్లు అయింది. అంతేగాకుండా ప్రపంచ మార్కెట్‌లో వరికి డిమాండ్ ఉండడంతో రబీ ధాన్యాన్ని ప్రైవేట్‌గా మిల్లర్లు సైతం పోటీపడి కొనుగోలు చేశారు. ఈ పరిణామాలు రైతుల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నమ్మకాన్ని పెంచినట్లు అయింది. సంబంధిత వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ ద్వారా పంటల సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. రైతుల వారీగా నీటి వసతి, అందుబాటులో ఉన్న వనరులు, మార్కెటింగ్ సదుపాయం తదితర వివరాలనూ నమోదు చేస్తున్నారు.

# పచ్చి మిర్చి.. ఆదాయం జాస్తి



సిద్దిపేట:వరి పంటకు ప్రత్యామ్నాయంగా సన్నమిర్చి పంటను సాగు చేస్తూ చిన్నకోడూరు, నారాయణరావుపేట మండల రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయ పంటల వైపు అన్నదాతలు ఆసక్తి కనబరచాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరిచారు. రెండు మండలాలకు చెందిన పలువురు కర్షకులు సన్న మిర్చి సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. వరికి పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. తెగుళ్ల బారిన పడుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో గత కొద్ది సంవత్సరాలుగా మిర్చి వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, కొద్దిపాటి నీటితో అధిక విస్తీర్ణంలో పంట సాగు చేసుకునే అవకాశం ఉండటంతో గంగాపూర్, మాచాపూర్, విఠలాపూర్, చంద్లాపూర్, రామంచ, గుర్రాలగొంది, జక్కాపూర్, మల్యాలలో అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు. దీనికి తుంపర సేద్య పరికరాలు అవసరం కావడంతో ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. ప్రస్తుతం రెండు మండలాల్లో 750 ఎకరాల్లో సన్న మిర్చి వేస్తున్నారు. సన్న మిర్చి విక్రయించేందుకు గంగాపూర్, మాచాపూర్ గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం గంగాపూర్ మార్కెట్‌కు 33 టన్నులు తీసుకొచ్చారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సిద్దిపేట ఉద్యాన శాఖాధికారి భాస్కర్‌రెడ్డి చెప్పారు. కొన్ని మండలాల్లోనే మిరపకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంకా పెరగాల్సి ఉంది. మార్కెట్ సౌకర్యం ఉండటంతో ధర పలుకుతోంది. దృష్టి పెడితే ఎకరాకు రూ.1.80 లక్షల ఆదాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. పది సంత్సరాలుగా మిర్చి పంట సాగు చేస్తున్నా. ఈ ఏడాది రెండు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన. ఎకరాకు రూ.45 వేల వరకు ఖర్చు వచ్చింది. ఇప్పటి వరకు రెండు సార్లు మిరపకాయలను తెంపిన. గంగాపూర్ మార్కెట్‌లో అమ్మితే రూ.1.20 లక్షలు వచ్చాయి. ఖర్చులు పోనూ రూ.60 వేల వరకు ఆదాయం వచ్చింది. మరో ఎకరంలో రావాల్సి ఉంది. వరితో పోల్చితే దీనితోనే ఎక్కువ ఆదాయం. గ్రామంలో తోటి రైతులు మిర్చి పంట సాగు చేయడం చూసి గత 5 సంవత్సరాలుగా వేస్తున్న. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో సాగైంది. రెండు దఫాలుగా కాయలు తెంపి అమ్మిన. రూ.50 వేలు చేతికందింది.

# పలు పట్టణాల్లోనూ యధేచ్ఛగా నీటి చౌర్యం



కొత్తగూడెం :ఉభయ జిల్లాల్లోని నగర, పురపాలకాల్లో వేసవిలో నీటి ఎద్దడి నిత్య సమస్యగా మారుతుంది. కొన్ని కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లో ఇళ్లకు అరకొరగా మంచినీరు సరఫరా అవుతుంది. కుళాయిలపై ఆధారపడే పేదలు తరచూ తమ ఆవేదనను అధికారులకు విన్నవిస్తున్నా పరిష్కారం దొరకడం లేదు. కొందరు పై ప్రాంతాల వారు కుళాయిలకు విద్యుత్తు మోటార్లు బిగిస్తూ నీళ్లు తోడేస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ వంటి పట్టణాలకు చెంతనే కిన్నెరసాని తాగునీటి పథకం, ఆపై 'మిషన్‌భగీరథ' జలాలు సరఫరా అవుతున్నా దాహార్తి తీరని పరిస్థితులున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉభయ జిల్లాల్లోని పలు పట్టణాల్లోనూ నీటి చౌర్యం యథేచ్ఛగా జరుగుతోంది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 69,520 కుళాయిలు ఉన్నాయి.సగటున ప్రతి వందలో 15కుళాయిలకు నేరుగా విద్యుత్తు మోటార్లు బిగిస్తున్నారని అనధికారిక అంచనా. దీని ప్రకారం నీటిని తోడేస్తున్న కనెక్షన్లు సుమారు 10వేల వరకు ఉంటాయని తెలుస్తోంది. నీటి సరఫరా సమయంలో జలాలను లాగేస్తుండటంతో చివరి ప్రాంతాల వారికి సన్నటి ధారలే దిక్కుగా మారుతున్నాయి. ఎక్కువగా మురికివాడలు, దిగువ మధ్యతరగతి వారు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో సమస్య ఉంది.కొందరు తమ ఇళ్లలో బోర్లు ఉన్నా..ఉచితమే కదాని కుళాయి నీళ్లను తోడేస్తున్నారు. భారీ వాటర్ ట్యాంకులు నింపుకొంటున్నారు. నీటి చౌర్యంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సరఫరా సమయంలో వార్డుల్లో తనిఖీల నిర్వహణను పూర్తిగా మరిచారు. అక్రమ కుళాయిలనూ తొలగించే పరిస్థితి లేదు. ఫలితంగా పురపాలకంపైనా ప్రభావం పడుతోంది. కొందరు వ్యక్తులు స్థానిక పురపాలకాల సిబ్బంది సహకారంతోనే అక్రమంగా కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని.. ఆపై మోటార్లు సైతం బిగించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా ఈ సమస్యపై దృష్టిపెట్టి కఠిన చర్యలు తీసుకుంటేనే తాగునీటి వెతలు తప్పుతాయి.

# నిర్లక్ష్యం.. అభివృద్ధికి ఆటంకం



మెదక్: నిధుల లేమి.. కొరవడిన పర్యవేక్షణ.. సిద్ధం చేయని ప్రతిపాదనలు.. ఇవన్నీ అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది. ఏళ్ల కిందట మంజూరైన నిధులతో చేపట్టిన పనుల పూర్తిపై దృష్టిసారించడం లేదు. కీలకమైన వలయ రహదారి విషయంలో అమాత్య ఇచ్చిన హామీ నెరవేరలేదు. నిజాం కాలంలో సుభాగా కొనసాగిన మెదక్ పట్టణం.. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. ప్రస్తుతం 21 మండలాలతో కొనసాగుతోంది. ప్రధాన రహదారి విస్తరణ చేపట్టడంతో కాస్త అభివృద్ధి కనిపిస్తోంది. అంతర్గత దారుల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. జలజాలం పనులను సాకుగా చూపారు. ఎట్టకేలకు పనులు పూర్తయినా ఇంకా సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తికాలేదు. 2014 డిసెంబరులో స్థానిక పీఎన్ఆర్ ఇండోర్ మైదానంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం కేసీఆర్ ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో మెదక్‌కు బాహ్యవలయ రహదారిని ప్రకటించారు. ఎనిమిదేళ్లయినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. మెదక్ మండలం మంబోజిపల్లి వరకు 765 (డి) జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలు మెదక్ మీదుగా మహారాష్ట్ర, హైదరాబాద్‌కు వెళ్తుండటంతో రద్దీ ఉంటోంది. వేడుకలు నిర్వహణ, ఆందోళనలు చేపట్టినా వాహనాలు నిలిచిపోతున్నాయి. బాహ్యవలయ రహదారికి సర్వే చేసి హద్దులు గుర్తించి వదిలేశారు. స్థానిక పిట్లం, గోసంద్రం చెరువులను కలిపి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.9 కోట్లు విడుదలయ్యాయి. 2014లో పనులు మొదలవగా కట్ట విస్తరణతో పాటు పటిష్టం, ఫుట్‌పాత్ వంటి పనులు చేపట్టారు. మురుగు కలవకుండా పిట్లం చెరువులో పైపులు బిగించారు. పచ్చదనం ఏర్పాటు, విద్యుత్తు దీపాలు, టైల్స్ వేయాల్సి ఉంది. ఆయా వనరుల కట్ట కయ్యాలు పడి మట్టి కొట్టుకుపోతోంది. రెండింటిని అనుసంధానం చేసి హవేలిఘనపూర్ మండలం ముత్తాయికోట మార్గంలోని సంజీవయ్య కాలనీ వద్ద చౌరస్తా అభివృద్ధి చేస్తామన్న ప్రకటన కార్యరూపం దాల్చలేదు. 70 వేలకు పైగా జనాభా ఉండగా ఒక్క ఉద్యానం లేదు.

# ఆ ముద్దు కోసం పెద్ద సాహసం చేసిన హనీ రోజ్



వీరసింహారెడ్డి సినిమాతో తెలుగు ప్రేక్షకులకి భాగా కనెక్ట్ అయిన మలయాళీ భామ హనీ రోజ్. ఈ బ్యూటీ ఎప్పుడో దశాబ్దం క్రితం ఆలయం అనే సినిమాలో శివాజీకి జోడీగా నటించింది. ఈ మూవీ డిజాస్టర్ కావడంతో తెలుగు ప్రేక్షకులు ఆమెని పెద్దగా పట్టించుకోలేదు. అయితే మాతృభాష అయిన మలయాళంలో సెటిల్ అయిన ఈ అమ్మడు అక్కడ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. మలయాళీలో మోహన్ లాల్ మమ్ముట్టి సురేష్ గోపి లాంటి స్టార్స్ అందరితో హనీ రోజ్ ఆడిపాడింది. హనీ రోజ్ అందానికి విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. 31 ఏళ్ళ ఈ బ్యూటీ కెరియర్ లో ఎన్నడూ లేనంతగా ఇమేజ్ ని ఆశ్వాదిస్తోంది. ముఖ్యంగా కుర్రకారు హనీ రోజ్ అందాలకి ఫిదా అయిపోతూ ఉంటారు. అందుకే సోషల్ మీడియాలో కూడా ఈ బ్యూటీకి విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే వీరసింహారెడ్డి తర్వాత తెలుగులో ఇప్పటి వరకు నెక్స్ట్ సినిమాకి ఆమె కమిట్ కాలేదు. యంగ్ హీరోల పక్కన హనీ రోజ్ హీరోయిన్ గా సెట్ కాకపోవడంతో తెలుగులో ఆఫర్స్ తక్కువగా ఉన్నాయి. అయితే మలయాళీ తమిళ్ లో ఈ అమ్మడు ప్రస్తుతం సినిమాలు చేస్తోంది. ఇదిలా ఉంటే ఇన్ స్టాగ్రామ్ లో ఈ బ్యూటీ చాలా యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా తనకి సంబందించిన అప్డేట్స్ ని అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. తాజాగా మరో ఇంటరెస్టింగ్ వీడియోని ఇన్ స్టాగ్రామ్‌లో హనీ రోజ్ షేర్ చేశారు. ఓ ఐర్లాండ్ లోనే బ్లార్నీ కోట ఉంది. క్రిస్టియన్స్ కి అది అత్యంత పవిత్రమైన ప్రదేశం. ఆ కోటపైన బ్లార్నీ స్టోన్ ని క్రిస్టియన్ విశ్వాసాలు కలిగిన అందరూ వంగి మరీ ముద్దు పెడుతూ ఉంటారు. అలా ఆ స్టోన్ కి ముద్దు పెట్టుకుంటే నేరుగా దైవంతో కనెక్ట్ అయినట్లు అని వారి నమ్మకం. హనీ రోజ్ కూడా అతి కష్టం మీద సాహసం చేసి మరీ బ్లార్నీ స్టోన్ ని ముద్దు పెట్టుకుంది. ఆ వీడియోని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసి అదోక అద్భుతమైన అనుభూతి అని పంచుకుంది. మొత్తానికి నమ్మకాలు కేవలం హిందువులలోనే కాకుండా క్రిస్టియన్స్‌లో కూడా భాగా ఉంటాయని బ్లార్నీ స్టోన్ కథ చూస్తే తెలుస్తోంది.

# తిరగబడర సామి అంటున్న రాజ్ తరుణ్




ఉయ్యాలా జంపాల సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన యంగ్ టాలెంటెడ్ యాక్టర్ రాజ్ తరుణ్. మొదటి సినిమా సక్సెస్ తో వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస అవకాశాలు సొంతం చేసుకుంటూ ఈ యంగ్ హీరో దూసుకుపోయాడు. ఆరంభంలో మూడు హిట్స్ వచ్చిన తరువాత కెరియర్ గాడితప్పింది. చేసిన సినిమాలు ఏవీ సక్సెస్ కాకపోవడంతో కాంపిటేషన్ లో వెనుకబడిపోయాడు.అయితే మరల మెల్లగా తన ఇమేజ్ బిల్డ్ చేసుకునే పనిలో రాజ్ తరుణ్ పడ్డాడు. అందులో భాగంగా ఇప్పటికే ఒటీటీలో అహ నా పెళ్ళంట వెబ్ సిరీస్ తో మంచి హిట్ అందుకున్నాడు. ఇప్పుడు ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తిరగబడర సామి టైటిల్ తో రొమాంటిక్ అండ్ కామెడీ ఎంటర్టైనర్ సినిమా చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. ఇందులో హీరోయిన్ మాల్వి మల్హోత్రా రాజ్ తరుణ్‌ని పైకి ఎత్తుకొని ఉండటం విశేషం. అలాగే ఇద్దరు కూడా నైట్ డ్రెస్ లలో ఉన్నారు. పోస్టర్ స్టిల్ బట్టి ఫిమేల్ డామినేషన్ తో ఇబ్బందులు పడే బాయ్ ఫ్రెండ్ పాత్రలో రాజ్ తరుణ్ కనిపిస్తున్నాడని అర్ధమవుతోంది. ఈ చిత్రాన్ని మల్కాపురం శివకుమార్ నిర్మిస్తూ ఉన్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి అంటే గతంలో యజ్ఞం పిల్లా నువ్వులేని జీవితం సినిమాలు గుర్తుకొస్తాయి. కమర్షియల్ డైరెక్టర్ గా మంచి పేరు సొంతం చేసుకున్న ఇతడు చాలా కాలం తర్వాత ఈ సినిమాతో గ్రాండ్ గా సక్సెస్ కొట్టాలనే ప్రయత్నంలో ఉన్నారు.

అందులో భాగంగా లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ కథతో ప్రయత్నం చేస్తున్నారు. ఇక రాజ్ తరుణ్ కూడా ఈ మూవీతో తిరిగి ఫామ్ లోకి రావాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ సినిమాలో మరో హీరోయిన్‌గా మున్నారచోప్రా నటిస్తోంది. జేబీ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తూ ఉండటం విశేషం. రాజ్ తరుణ్ ఈ సినిమా కోసం చాలా ఎఫర్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ హీరోలు అందరూ కూడా యూనివర్శల్ అప్పీల్ ఉన్న కథలవైపు వెళ్ళడంతో రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ చిత్రాలకి సరైన హీరో లేరు. ఇప్పుడు ఆ స్థానం రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తీసుకుంటాడేమో చూడాలి.

# విశ్వక్ సేన్ కోసం పవర్ ఫుల్ టైటిల్



యంగ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్ గ్యాప్ లేకుండా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేసుకుంటూ దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం కృష్ణ చైతన్య దర్శకత్వంలో సితార ఎంటర్టైన్మెంట్స్ లో విశ్వక్ 11వ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం రాజమం డ్రిలో జరుగుతోంది. ఇప్పటికే విశ్వక్ సేన్ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు. ఇప్పటి వరకు చేయనటువంటి మాస్ క్యారెక్టర్ లో ఎనర్జిటి క్ గా కనిపించబోతున్నాడు. ఇక గోదావరి జిల్లాల బ్యాక్ డ్రాప్ లోనే మూవీ కథ ఉంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీకి సంబందించిన ఇంటరెస్టింగ్ టాక్ తెరపైకి వచ్చింది. మూవీకి టైటిల్ ని ఖరారు చేసినట్లు టాక్ నడుస్తోంది. 'లంకల రత్న' అనే పేరుని పెట్టాలని అనుకుంటున్నారంట. ఈ టైటిల్ ఇంకా అఫీషియల్‌గా కన్ఫర్మ్ కాలేదు. దీంతో పాటు 'గ్యాంగ్స్ అఫ్ గోదావరి' అనే మరో టైటిల్ కూడా పరిశీలనలో ఉందని తెలుస్తోం ది. ఈ రెండు టైటిల్స్ కూడా సినిమా కంటెంట్ ని బలంగా జనాల్లోకి తీసుకెళ్ళే విధంగానే ఉన్నాయి. సినిమాలో హీరో క్యారెక్టర్ పేరు లంకల రత్నగా ఉ ంటుందంట. అందుకే అదే పేరు అయితే భాగా ఎలివేట్ అవుతుందని భావిస్తున్నట్లు టాక్. విశ్వక్ సేన్ కి కూడా ఈ టైటిల్ భాగా కనెక్ట్ అయ్యిందంట. ఇక గ్యాంగ్ స్టార్ గోదావరి టైటిల్‌కూడా బాగుండటంతోఫైనల్ ఛాయస్‌కోసం వెయిట్ చేస్తున్నా రంట. ఈ సినిమా నిర్మాణంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా భాగస్వా మిగా ఉన్న నేపథ్యంలో ఆయన కూడా టైటిల్ విషయంలో సలహాలు ఏమైనా ఇస్తారేమో చూడాలి. దాస్ కా దమ్కీ లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత విశ్వక్ నుంచి రాబోతోన్న మూవీ ఇదే కావడం విశే షం. ఇక ఈ సినిమా షూటింగ్ నెల రోజుల పాటు రాజమండ్రిలోనే జరగనున్నట్లు తెలుస్తోంది. మూవీ కోసం విశ్వక్ సేన్ గోదావరి స్లాంగ్ మాట్లాడటం కూడా ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోన్న మాట. ఇప్పటి వరకు విశ్వక్ ఎక్కువగా తెలంగాణ స్లాంగ్ లోనే అన్ని సినిమాలలో సంభాషణలు ఉంటున్నాయి. కృష్ణ చైతన్య మూవీ పక్కా గోదావరి మాస్ రోల్ కాబట్టి అక్కడి స్లాంగ్ ఉండాలని నేర్చుకొని చెబుతున్నట్లు సమాచారం.

# నిధి అగర్వాల్ పూజలు ఫలిస్తున్నాయా?



నిధి అగర్వాల్ ఆ మధ్య జ్యోతిష్యుడు వేణు స్వామి ఆధ్వర్యంలో ఇంట్లో కొన్ని పూజలు నిర్వహించిన సంగతి తెలిసిందే. కెరీర్ సవ్యంగా సాగేందుకు...సినిమాల్లో మంచి అవకాశాలు వచ్చేందుకు రాజశ్యామల యాగం చేసింది. అమ్మడు ఎంతో నియమ నిష్టలతో ఈ పూజలు వేణు స్వామి సమక్షంలో చేసింది. మరి ఈ పూజలు ఫలిస్తున్నాయా? మళ్లీ అవకాశాలకు చేరువ అవుతోందా? అంటే అవుననే వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ పవన్ కళ్యాణ్ సరసన 'హరి హర వీరమల్లు'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. యాగం చేయకముందే ఈ సినిమాకి సంతకం చేసింది. అయితే ఈ సినిమా డిలే అవుతుంది. కారణాలు ఏంటి? అన్నది తెలియదు. సినిమా షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ చేస్తారు? అన్నది క్లారిటీ లేదు. ఇలా రకరకాల సమస్యలతో నిధి అగర్వాల్ సైతం కన్ఫ్యూజన్ లో పడింది. ఈ సమయంలోనే పూజలకు పూనుకుంది. ఎలాగూ వాటిని దిగ్విజయంగా పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు మాలీవుడ్ లో ఓ రెండు సినిమాలకు సైన్ చేసిందన్న విషయం లీకైంది. అక్కడ ఇద్దరు అగ్ర హీరోలతో ఈ సినిమాలో చేయబోతుందిట. మరి వాటి వివరాలు ఏంటి? అన్నది తెలియాల్సి ఉంది. అదే నిజమైతే పూజలు ఫలించినట్లే. తెలుగులో అవకాశాలు రాకపోయినా ఏదో భాషలో వస్తే అక్కడైనా నటీ అయ్యే అవకాశం ఉంది. టాలీవుడ్ లో సక్సెస్ కాని ఎంతో మంది భామలు ఇతర భాషల్లో సక్సస్ అయ్యారు. అక్కడ నుంచి బాలీవుడ్ కి వెళ్లి అక్కడా రాణించారు. మరి నిధి జర్నీ అలా సాగుతుందా? మాలీవుడ్ నుంచి మళ్లీ టాలీవుడ్ పై ఫోకస్ పెడుతుందా? అన్నది చూడాలి. అమ్మడు 'సవ్యసాచి' సినిమాతో తెలుగులో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన వాటిని అందుకోవడంలో విఫలమైంది. ఆ తర్వాత నటించిన 'మిస్టర్ మజ్ను' కూడా అలాంటి ఫలితాన్నే అందించింది. అటుపై నటించిన ఇస్మార్ట్ శంకర్ మాత్రం ఆ రెండు పరాజయాల నుంచి బయటకు తెచ్చింది. కానీ ఆ సక్సెస్ ని మాత్రం కొనసాగించలేకపోయింది. అయినా లక్కీ గా పీకే సినిమాలో ఛాన్స్ అందుకుంది.

# భగవంత్ కేసరి నుంచి కాజల్ పోస్టర్ రిలీజ్..




పదిహేనేళ్ల క్రితం పదహారేళ్ల వయసు పైబడిన ఏ అబ్బాయిని కదిలించిన కాజల్ అగర్వాల్ నామమే జపం చేశారు. అంతలా తన సినిమాలతో యూత్‌లో తిరుగులేని పాపులారిటీ తెచ్చుకుంది ఈ ముంబై బ్యూటీ. చందమామా, మగధీర, డార్లింగ్, బృందావనం, మిస్టర్ పర్‌ఫెక్ట్ ఇలా బ్యాక్ టు బ్యాక్ బంపర్ హిట్లతో టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ అయిపోయింది. ఇప్పటికి సౌత్‌లో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే నటీమణులలో కాజల్ ఒకరు. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో అరడజనుకు పైగానే సినిమాలున్నాయి. అందులో బాలకృష్ణ నటిస్తున్న భగవంత్ కేసరి ఒకటి.అనీల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. కాగా సోమవారం కాజల్ బర్త్‌డే సందర్భంగా మేకర్స్ ఈ సినిమాలోని కాజల్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కాజల్ ఓ చేతిలో బుక్ పట్టుకుని మరో చేతిలో ఫోన్ పట్టుకుని కాల్ మాట్లాడుతుంది. కళ్లజోడు ధరించి క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటుంది.

# రంగబలి నుంచి కల కంటు ఉంటే ఫుల్ లిరికల్ వీడియో సాంగ్



టాలీవుడ్ యాక్టర్ నాగశౌర్య నటిస్తున్న తాజా చిత్రం రంగబలి. పవన్ బసంశెట్టి (డెబ్యూ) దర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ లాంఛ్ చేసిన రంగబలి టీజర్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. మేకర్స్ ఈ సినిమా నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ సాంగ్ మన ఊరిలో ఎవడ్రా ఆపేది సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ మూవీ నుంచి ఇప్పటికే రెండో సాంగ్ కల కంటూ ఉంటే ప్రోమోను లాంఛ్ చేశారు. మేకర్స్ తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. హీరోహీరోయిన్ల మధ్య రొమాంటిక్ ట్రాక్‌తో సాంగ్ సాగుతోంది. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను సార్థక్ కళ్యాణి, వైశ్ పాడారు. రంగబలి మూవీలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో వస్తున్న ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో సత్య, అనంత్ శ్రీరామ్, గోపరాజు రమణ, కల్యాణి నటరాజన్, శుభలేఖ సుధాకర్, మురళీ శర్మ, సప్తగిరి, రాజ్ కుమార్ కసిరెడ్డి, భద్రం, శివనారాయణ, పీకే, పవన్, నోయెల్, రమేశ్ రెడ్డి, హరీష్ చంద్ర, బ్రహ్మాస్త్రి, ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com